సంపుటి : 9
సంచిక : 300
గురువారం
23 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999



భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి

# మోదీకి ఆహ్వానం

ప్రధానితో భేటీ అయిన సీఎం చంద్రబాబు నాయుడు

ఆగస్టు 1న విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానం - ఏర్పాట్లపై ప్రత్యేక అధికారుల నియామకం

**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :**

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆగస్ట్ 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ప్రధానిని స్వయంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ అయ్యారు. ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి అత్యంత కీలకమని, దీని ప్రారంభోత్సవానికి తప్పక రావాలని వారు ప్రధానిని కోరారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక



ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర, రాజమండ్రి కమిషనర్ రాహుల్ మీనా, గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్‌లు ప్రజా అవసరాలు, పారిశుద్ధ్య వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. వీరికి సహకారం అందించేందుకు మరో 26 మంది

మిగతా .. 2లో..

# ఉద్యోగాల సృష్టిలో విశాఖ టాప్..

- మెట్రోయేతర నగరాల్లో అగ్రస్థానం
- లింక్డ్ఇన్ విడుదల చేసిన తాజా నివేదికలో ఈ విషయం వెల్లడి
- ఈ జాబితాలో విశాఖ తర్వాత లుథియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్
- సంప్రదాయ పరిశ్రమలతో పాటు టెక్నాలజీ, ఫైనాన్స్ రంగాల్లోనూ వృద్ధి
- పెరిగిన పోటీ నేపథ్యంలో చిన్న నగరాలు కొత్త అవకాశాలు అందిస్తున్నాయని వెల్లడి




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రోయేతర నగరాల జాబితాలో విశాఖ పట్నం మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఉద్యోగాల కల్పన, వలసల విషయంలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్ 'లింక్డ్ఇన్' నేడు విడుదల చేసిన నివేదికలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఈ జాబితాలో విశాఖ తర్వాత లుథియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్ వరుసగా టాప్ 5 స్థానాల్లో ఉన్నాయి. ఈ నివేదిక ప్రకారం.. ఒకప్పుడు కేవలం సంప్రదాయ పరిశ్రమలకే పరిమితమైన ఈ నగరాలు ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, తయారీ, విద్య, మౌలిక సదుపాయాల కల్పన వంటి రంగాల్లో వస్తున్న పెట్టుబడులతో సరికొత్త ఉద్యోగావకాశాలను సృష్టిస్తున్నాయి. దీంతో ఈ నగరాలు బహుళ రంగాల జాబ్ మార్కెట్లుగా రూపాంతరం చెందుతున్నాయని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం దేశంలో ఉద్యోగాల కోసం తీవ్రమైన పోటీ

మిగతా .. 2లో..

# మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు



**కాశీబుగ్గ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ జీఎంఈ కాలనీలోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసి స్థానిక పీఎస్‌కు తరలించారు. అక్కడ అప్పలరాజు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. కాసేపట్లో ఆయన్ను ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించే అవకాశముంది. అప్పలరాజు అరెస్ట్ నేపథ్యంలో ఆయన ఇంటి వద్దకు కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. కాశీబుగ్గలో ఈనెల 10న రాత్రి అప్పలరాజు కుమారుడు ఆరవ్ అతివేగంతో బైక్ నడిపి గొర్రెల కాపరి దానయ్య మృతికి కారణమయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోకముందే ఆరవ్‌ను అక్కడినుంచి ఓ కారులో

మిగతా .. 2లో..

సాయికృష్ణ మృతి కేసులో సీఐ నాగరాజు

## రిమాండ్ పొడిగింపు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయికృష్ణ మృతి కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు రిమాండ్‌ను విజయవాడ కోర్టు పొడిగించింది. బుధవారంతో రిమాండ్ గడువు ముగియనుండటంతో రాజమహేంద్రవరం కారాగారంలో ఉన్న నాగరాజును వర్చువల్‌గా రెండో ఏజేఎం ఎఫ్‌సీ కోర్టు న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. వాదనలు విన్న న్యాయస్థానం.. రిమాండ్‌ను ఈనెల 28వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..

# భారీగా అభివృద్ధి చేస్తా

- మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో పేదలకు శాశ్వత పట్టాల పంపిణీ
- ప్రజలిచ్చిన భారీ మెజారిటీతోనే అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్న లోకేష్
- మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం
- రూ.1800 కోట్లతో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- కేంద్ర నిధులతో ఎంపీ పెమ్మసాని సహకారంతో అభివృద్ధి పనులు



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరి నియోజకవర్గ ప్రజల దశాబ్దాల కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని, రాష్ట్రమంతా ఈ నియోజకవర్గం వైపు చూసేలా అభివృద్ధి చేసి చూపిస్తానని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. 'మన ఇల్లు-మన లోకేశ్' కార్యక్రమంలో భాగంగా రెండోరోజైన బుధవారం మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన సుమారు 3 వేల మంది లబ్ధిదారులకు శాశ్వత ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు.

**భారీ మెజారిటీతోనే భారీ అభివృద్ధి**

ఈ ఎన్నికల్లో ప్రజలు తనకు 91 వేల ఓట్ల భారీ మెజారిటీ కట్టబెట్టారని, ఆ విజయమే తనకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని

మిగతా .. 2లో..

పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్..

## సమగ్ర విచారణకు పవన్ ఆదేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని పంచదార్ల కొండ రెవెన్యూ భూముల్లో అక్రమ మైనింగ్‌పై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విచారణకు ఆదేశించారు. ఈ వ్యవహారంపై అనకాపల్లి జిల్లా కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన మాట్లాడారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చిన ప్రాథమిక నివేదికను పరిశీలించి.. తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మైనింగ్ అనుమతులు పొందిన సంస్థ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ స్పష్టం చేశారు. పంచదార్ల కొండ దిగువన ఉన్న శ్రీఉమా ధర్మలింగేశ్వర స్వామి వారి ఆలయం, సహజ జలధారల ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంరక్షణ చర్యలు చేపట్టాలని పవన్ సూచించారు. జలధారల రంగు మార్పుపై జాతీయ జలవిజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలను ఆహ్వానించాలన్నారు. జలధారల మూలాలను పరిశీలించి, సహజ ప్రవాహ సంరక్షణకు

మిగతా .. 2లో..

బస్సును రోడ్డు పక్కన ఆపి..

## స్టీరింగ్‌పై వాలిపోయి..



**ఆత్మకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా సంగం మండల కేంద్రంలో ఓ ఆర్టీసీ బస్సుకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. పామూరు నుంచి నెల్లూరుకు 45 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్ త్రిమోది ప్రయాణం మధ్యలో అకస్మాత్తుగా

మిగతా .. 2లో..

వాటి వల్ల డాక్యుమెంట్ రైటర్ల

## వృత్తికి నష్టం ఉండదు : మంత్రి అనగాని



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో 297 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలుంటే.. జిల్లాకు ఒకటి చొప్పున 26 చోట్లే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, వీటివల్ల డాక్యుమెంట్ రైటర్ల వృత్తికి ఎలాంటి నష్టం కలగదని రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

మిగతా .. 2లో..

వైకాపా నేత భూమన భూ ఆక్రమణలపై

## ఏపీ ప్రభుత్వం కొరడా



**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత భూమన కరుణాకర్‌రెడ్డి భూ ఆక్రమణలపై ఏపీ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. తిరుపతి నగర పరిధిలోని మంగళం, చిగురువాడలో ఆయన ఆక్రమించిన ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం హెచ్చరిక

మిగతా .. 2లో..

పేదల సొంత ఇంటి కలను

## మేం నెరవేరుస్తున్నాం

తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదవాడి ఆత్మగౌరవమైన సొంత ఇంటి కలను మేం నెరవేరుస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట ప్రజలను మోసం చేసిందని

మిగతా .. 2లో..




# 10 ఏళ్లలో 152 పరీక్షల పేపర్లు లీక్ : రాహుల్ గాంధీ




**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. చివరి నిమిషంలో ప్రశ్నపత్రాల లీకేజీ వంటి ఘటనలతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. నీట్ అవకతవకలపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాల ఆందోళనల వేళ.. రాహుల్ మీడియా సమావేశం నిర్వహించారు. గత 10 ఏళ్లలో 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయని ఆయన ఆరోపించారు. "విద్యార్థుల విషయంలో ఏం జరుగుతోంది. పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని యువత కోరుతోంది. కానీ, ఈ ప్రభుత్వం శాంతియుతంగా నిరసనలు చేస్తున్న వారిపై లాఠీఛార్జ్ చేయించింది. మధ్యతరగతి కుటుంబాలకు చదువు ఆర్థిక భారంగా మారింది. విద్యపై రూ.1.4లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు కేంద్రం చెబుతోంది. కానీ, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తంగా 152 పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. దీని వల్ల 7.50కోట్ల మంది విద్యార్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎంత బాధపడుతున్నా.. ఈ ప్రభుత్వం లెక్కచేయట్లేదు. ఈ పేపర్ లీకేజీ ఘటనల్లో

మిగతా .. 2లో..

నౌకలపై దాడి చేస్తే..

## వంతెనలపై విరుచుకుపడతా : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇకనుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా.. ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్ కేంద్రంపై బాంబులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. టెహ్రాన్‌లో లేదా దాని సమీపంలో కూడా దాడి చేసే అవకాశం ఉందన్నారు. ఈమేరకు ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇప్పటికే తీవ్రమయ్యాయి. ఇరుదేశాలు పరస్పరం దాడులు

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## మోదీకి ఆహ్వానం

నాన్-క్యాడర్ అధికారులను కూడా నియమించారు. వీరంతా విజయనగరం జిల్లా కలెక్టర్‌కు రిపోర్ట్ చేస్తూ ఏర్పాట్లను సమన్వయం చేయనున్నారు. విజయనగరం జిల్లాలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఈ 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఉత్తరాంధ్ర ప్రాంతానికి మణిహారంగా నిలుస్తుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం ఏర్పాటు తర్వాత ఆ ప్రాంతంలో వచ్చిన అభివృద్ధి తరహాలోనే భోగాపురం పరిసరాలు కూడా శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వేలాదిగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

## ఉద్యోగాల సృష్టిలో విశాఖ టాప్..

నెలకొంది. ఈ ఏడాది సుమారు 72శాతం నిపుణులు కొత్త ఉద్యోగం కోసం చురుగ్గా వెతుకుతున్నారని, అయితే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో నైపుణ్యాల అంతరం పెరగడం, పోటీ ఎక్కువవడంతో ఉద్యోగ వేట కష్టతరంగా మారిందని 76శాతం మంది భావిస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2022 ఆరంభంతో పోలిస్తే ప్రస్తుతం ఒక్కో ఉద్యోగానికి దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు అయింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న నగరాలు సొంత ప్రాంతాలకు దగ్గరగా విభిన్నమైన కెరీర్ అవకాశాలను అందిస్తున్నాయి. ఈ విషయంపై లింక్డ్ఇన్ కెరీర్ నిపుణురాలు నీరజితా బెనర్జీ మాట్లాడుతూ.. "ఈ నగరాల్లోని సంప్రదాయ పరిశ్రమలకు ఇప్పుడు టెక్నాలజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటివి తోడవుతున్నాయి. ఉద్యోగార్థులు మెట్రో నగరాలను దాటి ఆలోచించాలి. ఏ రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయో, మీ నైపుణ్యాలు ఏయే పరిశ్రమలకు సరిపోతాయో చూసుకోవాలి" అని సూచించారు. విశాఖపట్నం తన సంప్రదాయ బలాలుగా ఉన్న పోర్టు, ఫార్మా, తయారీ రంగాలతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, టెక్నాలజీ రంగాల్లోనూ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని నివేదిక వివరించింది. అదేవిధంగా లుధియానాలో స్టీల్, ఏవియేషన్, సూరత్‌లో స్టార్టప్‌లు, రియల్ ఎస్టేట్, వడోదరలో టెక్నాలజీ, ఇంజినీరింగ్ రంగాలు వేగంగా విస్తరిస్తున్నాయని పేర్కొంది.

## మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అరెస్టు

తరలించేశారు. ఆయా దృశ్యాల సీసీటీవీ ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఈ కేసు నుంచి తన కుమారుడిని తప్పించేందుకు అప్పలరాజు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. నేరానికి పాల్పడిన తన కుమారుడి స్థానంలో అప్పటికప్పుడు మరొకరిని ప్రవేశపెట్టి వ్యవస్థలు, వ్యక్తులను మేనేజ్ చేసినా ఆ గుట్టు రట్టైంది. నేరాన్ని కప్పిపుచ్చడం, పోలీసుల్ని తప్పుదారి పట్టించడం, నిందితుడ్ని ఘటనా స్థలం నుంచి ఆగమేఘాలపై తప్పించడం, సాక్ష్యాధారాలు మాయం చేయడానికి యత్నించడం, తన అనుచరులను రంగంలోకి దించి బాధితుడి కుటుంబంతో రాజీకి ప్రయత్నించడం.. ఇలా మొత్తం కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వమంతా నడిపించి విషయం బయటకు రాకుండా తొక్కిపెట్టాలని చూసినా ఫలించలేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో సీదిరి అప్పలరాజు తన కుమారుడు ఆరవ్ వర్మను పోలీసుల ఎదుట లొంగిపోయేలా చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద ఆరవ్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. నేరాన్ని కప్పిపుచ్చేందుకు కుట్ర పన్నడంతో సీదిరి అప్పలరాజుపైనా కేసు నమోదైంది. దీంతో తాజాగా ఆయన్ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

బస్సును రోడ్డు పక్కన ఆపి..

## స్టీరింగ్‌పై వాలిపోయి..

తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అయితే ప్రాణాపాయ పరిస్థితిలోనూ త్రిమోది అప్రమత్తంగా వ్యవహరించాడు. స్టీరింగ్‌పై వాలిపోయే ముందే బస్సును రోడ్డు పక్కన సురక్షితంగా నిలిపివేశాడు. దీంతో బస్సులో ఉన్న 45 మంది ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. డ్రైవర్ పరిస్థితిని గమనించిన ప్రయాణికులు వెంటనే అతడిని సంగం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ బస్సును ఏర్పాటు చేయడంతో వారు వెళ్లారు.

పంచదార్ల కొండపై అక్రమ మైనింగ్..

## సమగ్ర విచారణకు పవన్ ఆదేశం

సంబంధించిన శాస్త్రీయ నివేదికలు తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థపై జరిమానాతోపాటు పర్యావరణ పునరుద్ధరణ బాధ్యత కూడా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచదార్ల కొండ పరిసరాలను నో మైనింగ్ జోన్‌గా ప్రకటించాలని రెవెన్యూ, మైనింగ్ శాఖలకు పవన్ సూచించారు. ఆ మైనింగ్ సంస్థకు ఇచ్చిన పర్యావరణ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించారు.

మంగళగిరి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారు..

## భారీగా అభివృద్ధి చేస్తా

లోకేష్ అన్నారు. "మీరిచ్చిన ఈ అఖండ విజయం వల్లే నేను కేంద్రంలోని పెద్దలతో మాట్లాడి నిధులు తీసుకురాగలుగుతున్నా. మంగళగిరి ప్రజలే నా కుటుంబం. ఇక్కడ నాకు సొంత అక్కాచెల్లెళ్లు లేకపోయినా, మీ అందరినీ చూస్తుంటే నా సొంతవారిని చూసినట్లే ఉంటుంది" అని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.

**ఓటమి నేర్పిన పాఠం.. ప్రజల మనసు గెలిచా**

2019 ఎన్నికల నాటి అనుభవాలను లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "అప్పుడు ఇంటి పట్టాల రెగ్యులరైజేషన్‌పై హామీ ఇవ్వమని అడిగారు. కానీ, పూర్తి అవగాహన లేకుండా హామీ ఇవ్వడం సరికాదని చెప్పడంతో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. ఆ ఓటమి నాలో కసి పెంచింది. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు అహర్నిశలు శ్రమించి మంగళగిరి ప్రజల మనసు గెలుచుకున్నా" అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత నిధులతో ఎన్టీఆర్ సంజీవని క్లినిక్‌లు, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు, పేదల ఇళ్లలో శుభకార్యాలకు సాయం, అంత్యక్రియలకు ఆర్థిక సాయం వంటి 29 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని వివరించారు.

**మోడల్ నియోజకవర్గమే లక్ష్యం**

మంగళగిరిని దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. నియోజకవర్గంలోని భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1800 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్రం నుంచి ఛాలెంజ్ ఫండ్, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ నిధులతో ఈ పనులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. దీంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మాణం, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి, మూసేసిన అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం, పైప్‌లైన్ గ్యాస్ వంటి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. నిడమర్రు స్కూలులో సీటు కోసం ఒక తల్లి తనతో వాదించడం ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల ప్రయాణం**

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తోందని లోకేశ్ అన్నారు. 'తల్లికి వందనం' పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాల్లో నేటి నుంచి నిధులు జమ చేస్తున్నామని, 4 వేల రూపాయల పింఛను, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను దశలవారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేయడం వల్లే కేంద్రం నుంచి నిధులు సులభంగా వస్తున్నాయని, నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను 12 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు నందం అబద్ధయ్య, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాటి వల్ల డాక్యుమెంట్ రైటర్ల

## వృత్తికి నష్టం ఉండదు : మంత్రి అనగాని

తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అపోహలో డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారని.. అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. కొన్ని పార్టీల నేతలకు ప్రజలు సంతోషంగా ఉండటం ఇష్టముండదని మండిపడ్డారు. ప్రాంతాలు, కులాలు, ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారి మధ్య చిచ్చుపెట్టేందుకు చూస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు సంబంధించిన భూమి విషయంలో జరిగిన పొరపాటును సరిచేస్తామని.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు కచ్చితంగా తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

వైకాపా నేత భూమన భూ ఆక్రమణలపై

## ఏపీ ప్రభుత్వం కొరడా

బోర్డులను ఏర్పాటు చేశారు. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో తిరుపతి నగర శివారులోని మంగళం సమీపంలో 9 ఎకరాల ప్రభుత్వ భూమిని భూమన ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఆ భూమి విలువ సుమారు రూ.45కోట్లు ఉంటుందని సమాచారం. మరోవైపు చిగురువాడ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున 7.31 ఎకరాల భూమిని ఆక్రమించి కంచె వేశారు. ఆ భూమిలో వరి పంట పండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూమన కరుణాకర్‌రెడ్డి భూ ఆక్రమణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రికార్డులు తారుమారు చేసి భూమనతో పాటు ఆయన భార్య పేరిట పట్టాలు తీసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. భూ ఆక్రమణలు నిజమేనని నిర్ధరిస్తూ ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. మరోవైపు భూమన కోర్టును ఆశ్రయించినప్పటికీ ఆయనకు ఉపశమనం లభించలేదు. ఈ నేపథ్యంలో తిరుపతి అర్బన్ తహసీల్దార్ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు.

పేదల సొంత ఇంటి కలను

## మేం నెరవేరుస్తున్నాం

ఆరోపించారు. గాంధీభవన్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను ఆయన స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజల బాధలు వినడానికి ఎలాంటి అవకాశం ఉండేది కాదన్నారు. "రాష్ట్రంలో ఇప్పటికే 7.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. గతంలో హైదరాబాద్ వంటి నగరంలో సొంత ఇల్లు కలగానే ఉండేది. అప్పట్లో డబుల్ బెడ్ రూమ్ అంటూ మాయ మాటలు చెప్పి మోసం చేశారు. మేం హైదరాబాద్‌లో ఎకరం రూ.200 కోట్లు ఉన్నా.. ప్రజల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం. నగర ప్రజలు ఇళ్ల కోసం 'మీసేవ'లో అప్లై చేసుకోవాలి. గతంలో చేసిన వారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాలి." అని పొంగులేటి తెలిపారు.

## 10 ఏళ్లలో 152 పరీక్షల పేపర్లు లీక్ : రాహుల్ గాంధీ

ఇప్పటివరకు శిక్షపడిన నేరస్థుల సంఖ్య సున్నా" అని రాహుల్ విమర్శించారు. "దేశ యువతకు ఉద్యోగాలు లేవు. విద్యార్థుల ఆశలు, ఆకాంక్షలను ఈ ప్రభుత్వం నాశనం చేస్తోంది. మన దేశంలో చైనా వస్తువుల సంఖ్య పెరిగింది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. బ్యాంకులను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారు. ఏఐ వల్ల కార్పొరేట్ రంగంలో ఉద్యోగాలు పోతున్నాయి. కేంద్రం విధానాల వల్ల పేదలు, విద్యార్థులు నష్టపోతున్నారు. విద్యార్థులంటే మనకు శత్రువులు కాదు. ఈ దేశ భవిష్యత్తు అన్న విషయం కేంద్రం గుర్తుంచుకోవాలి" అని మండిపడ్డారు.

**విద్యార్థుల డిమాండ్లు ఇవే..**

"విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద ప్రధాన్ పూర్తిగా విఫలమయ్యారు. లీకేజీకి బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని యువత డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి జవాబుదారీతనాన్ని యువత కోరుకుంటోంది. ఆందోళన చేస్తోన్న యువతపై దాడి చేసిన వారికి శిక్ష పడాలని కోరుతోంది. ఇక, ఈ వైఫల్యాలకు గానూ ప్రధాని క్షమాపణలు చెప్పాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల డిమాండ్లకు మేం పూర్తి మద్దతు ప్రకటించాం" అని రాహుల్ వెల్లడించారు.

**ఎన్ని దెబ్బలకైనా సిద్ధం..**

"విద్యార్థుల ఆందోళనను మేం రాజకీయాలకు వాడుకోవట్లేదు. ప్రతిపక్ష నేతగా ప్రజల గళం వినిపించడం నా బాధ్యత. దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు కేంద్రం అవకాశం ఇవ్వట్లేదు. అందుకే విద్యార్థులకు మద్దతుగా వీధుల్లోకి వచ్చాం. నిన్న నిరసనల్లో నా పట్ల జరిగిన దానికి బాధపడటం లేదు. విద్యార్థులకు జరుగుతోన్న నష్టం విషయంలోనే బాధగా ఉంది. పరీక్షల విధానంలో మార్పులు రావాలి. ప్రజల కోసం ఎన్ని దెబ్బలు తినేందుకైనా నేను సిద్ధం" అని కాంగ్రెస్ ఎంపీ తెలిపారు.

నౌకలపై దాడి చేస్తే..

## వంతెనలపై విరుచుకుపడతా : ట్రంప్

చేసుకుంటున్న విషయం తెలిసిందే. పికాక్స్ పర్వతాన్ని ధ్వంసం చేస్తామని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో ఇరాన్ కూడా దాడులను ముమ్మరం చేసింది. మరిన్ని దాడులకు పికాక్స్ పర్వతాన్ని సాకుగా వాడుకుంటున్నారని ఆరోపించిన ఇరాన్.. జోర్డాన్‌లోని పలు ప్రాంతాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. అయితే, వాటిని సమర్థంగా అడ్డుకున్నామని జోర్డాన్ సైన్యం వెల్లడించింది. మరోవైపు, ఎర్ర సముద్రంలో సౌదీ నౌకలను దిగ్బంధనం చేస్తామని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ భయాల నేపథ్యంలోనే ముడిచమురు ధర మరోసారి భగ్గుమంది. ప్రస్తుతం బ్యారెల్ ధర 94 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

## వారు శ్రీకాకుళం పరువు తీశారు

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అక్రమాలు ఇంకా చాలా ఉన్నాయని, వాటన్నిటిపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ నేతల అరాచకాల వల్ల జిల్లా ప్రతిష్ఠ మసకబారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి మంత్రిగా, సభాపతిగా కీలక బాధ్యతలు నిర్వహించిన వారు చేసిన దారుణాలు చూసి నివ్వెరపోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. బతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లుగా చిత్రీకరించి భూములు కాజేయడం సిగ్గుచేటని, అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే తాను ఆత్మహత్య చేసుకునేవాడినని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ స్పీకర్‌గా విలువలతో కూడిన ఉపన్యాసాలు ఇచ్చి, తెరవెనుక ఇలాంటి అక్రమాలకు ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. తప్పు చేసిన వారికి, వారిని సమర్థించే వారికి నైతికత లేదని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు అలాగే తయారైందని విమర్శించారు. గతంలో తనపై పెట్టినవన్నీ తప్పుడు కేసులు కాబట్టే తాను ధైర్యంగా ఉన్నానని, అక్రమాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ఆగమేఘాల మీద అరెస్టులు చేసే సంస్కృతి తమ ప్రభుత్వానిది కాదని తేల్చి చెప్పారు.

**రైతుల సమస్యలపై జగన్ నాటకాలు**

గత ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని జగన్మోహన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పొగాకు కొనుగోళ్లలో తలెత్తిన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారని, ఢిల్లీలో జరిపిన చర్చలు సఫలమయ్యాయని వివరించారు. ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు విషయంలోనూ కేంద్ర మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సానుకూల పరిణామాలను జీర్ణించుకోలేక, జగన్ తన పార్టీ కార్యకర్తలకు రైతు కండువాలు కప్పి కొత్త నాటకాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు.

**పొగాకు, ఆక్వా రైతుల సమస్యలకు కేంద్రం నుంచి త్వరలోనే పరిష్కారం**

రాష్ట్రం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసిన చేసిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పొగాకు రైతులతో జగన్ జరిపిన సమావేశం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కేంద్ర మంత్రులు పొగాకు కొనుగోళ్లు, ఆక్వా ఫీడ్ ధరల తగ్గింపు అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వైసీపీ కార్యకర్తలకు రైతు కండువాలు వేసి జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు.

## తమ్మినేని కుటుంబానికి హైకోర్టులో దక్కని ఊరట

**అరెస్ట్ నుంచి రక్షణకు నిరాకరణ**

**తమపై నమోదైన ఎఫ్ఐఆర్ కొట్టేయాలన్న పిటిషన్‌ను తోసిపుచ్చిన న్యాయస్థానం**

**అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కల్పించేందుకు నిరాకరణ**

**విచారణ ప్రాథమిక దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన కోర్టు**

**హైకోర్టు తీర్పు నేపథ్యంలో తమ్మినేని కుటుంబం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం**



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళంలో సంచలనం సృష్టించిన భూకబ్జా కేసులో మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ నేత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని (క్వాష్) కోరుతూ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణి, కుమారుడు చిరంజీవి నాగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం తిరస్కరించింది. వారిని అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. మంగళవారం ఈ పిటిషన్‌పై జస్టిస్ వై. లక్ష్మణరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, ఇలాంటి సమయంలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. అరెస్ట్ భయం ఉంటే ముందస్తు బెయిల్ (యాంటిసిపేటరీ బెయిల్) కోసం పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని పిటిషనర్లకు సూచించింది. కౌంటర్లు దాఖలు చేయాలని పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను జూలై 29కి వాయిదా వేసింది. శ్రీకాకుళం పట్టణం, చాపరం గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.4 కోట్ల విలువైన 900 గజాల స్థలాన్ని కబ్జా చేశారని తమ్మినేని కుటుంబంపై ఆరోపణలు ఉన్నాయి. బతికున్న యజమాని చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించి, దొంగ పత్రాలతో ఆ స్థలాన్ని తమ్మినేని కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని కట్టా జయకిషోర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు మొత్తం 13 మందిని నిందితులుగా చేర్చగా, ఇప్పటికే 8 మందిని అరెస్ట్ చేశారు. హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాత తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యులు ఆమదాలవలసలోని తమ నివాసం నుంచి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. వారి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

## విద్యార్థుల నిరసనలను రాజకీయాలకు వాడుకోవద్దు : నడ్డా

**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజకీయం చేస్తున్నారని కేంద్ర మంత్రి జేపీ నడ్డా ఆరోపించారు. నిందారోపణలకు దిగకుండా.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు పార్లమెంటులో ఈ విషయంపై విస్తృత చర్చకు విపక్షాలు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. భాజపా కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన నడ్డా.. ఈ విషయాన్ని తమ ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. గతంలో యూపీఏ హయాంలోనూ పేపర్లు లీక్ అయ్యాయని.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్నాయని అన్నారు. అంతకుముందు.. దేశంలో విద్యావ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. గత పదేళ్లలో 152 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయని అన్నారు. కోట్లాది మంది విద్యార్థులు బాధపడుతున్నా.. ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు.

## ఆ హామీ ఇస్తే.. దీక్ష విరమిస్తా : వాంగ్‌చుక్



**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దోషులను శిక్షించాలంటూ సీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు మద్దతుగా పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న ఆయన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లకు లేఖ రాశారు. ఆందోళనల్లో పాల్గొన్న యువతపై ఎటువంటి చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇస్తే దీక్ష విరమిస్తానని స్పష్టం చేశారు. ఆందోళన విరమించి ప్రభుత్వంతో చర్చలు జరపాలని నిరసనకారులను కూడా కోరతానన్నారు. "కేంద్ర మంత్రులు ఆసుపత్రికి వచ్చి నన్ను పరామర్శించి, దీక్ష విరమించాలని కోరినందుకు ధన్యవాదాలు. పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అవసరమైన పరిహారం ఇవ్వడం, విద్యాశాఖ మంత్రి రాజీనామా అంశాన్ని పరిశీలించడంతో పాటు పార్లమెంటులో దీనిపై చర్చ జరపాలన్న విజ్ఞప్తికి మీరు సానుకూలంగా స్పందించారు. మీ తర్వాత.. దీక్ష విరమించాలని కోరుతూ వివిధ పార్టీలకు చెందిన 65 మంది ఎంపీలు నాకు లేఖ రాశారు. వారితో నేను ఏకీభవించాను" అని వాంగ్‌చుక్ పేర్కొన్నారు. 'నేను కూడా జీవించాలని అనుకుంటున్నా. విద్యార్థుల కోసం ఎంతో చేయాల్సి ఉంది. అయితే, ఈ ఉద్యమం ఎవరికోసమైతే మొదలైందో, వారి జీవితాలను పణంగా పెట్టి అలా చేయలేను. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారిపై ఎటువంటి చర్యలు, చట్టపరమైన కేసులు, వేధింపులు ఉండవని హామీ ఇస్తే దీక్షను విరమిస్తా. లేదంటే నిరవధిక దీక్షను కొనసాగించాల్సి వస్తుంది. నిరసనకారులపై ఇకపై పోలీసు బలప్రయోగం ఉండదని ఆశిస్తున్నా" అని వెల్లడించారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో 43 లక్షల ఓట్లు ఔట్.. వైసీపీ సంచలన ఆరోపణలు

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది.

రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది.

కాగా, కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుండటంతోనే భారీగా ఓట్లను తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబును ట్యాగ్ చేస్తూ వైసీపీ ట్వీట్ చేసింది. ప్రధానంగా గడువు పెంచిన తర్వాతే ఎక్కువగా ఓట్లను తొలగించారని ధ్వజమెత్తింది. తమ పార్టీకి పట్టున్న జిల్లాల్లో ఎక్కువ ఓట్లు డిలీట్ చేస్తున్నారని మండిపడింది. మొత్తానికి సర్ పై వైసీపీ చేసిన ఆరోపణలు హాట్ టాపిక్ అవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 45 రోజులుగా సర్ ప్రక్రియ కొనసాగుతోంది. అధికార కూటమి నేతలతోపాటు విపక్ష నేతలు తమ ఓటర్లను కాపాడుకోడానికి విశ్వప్రయత్నాలు చేశారని చెబుతున్నారు. అయితే సరైన ఆధారాలు లేకపోవడం, ఓటర్ల ఆచూకీ లేకపోవడం వల్ల దాదాపు 44 లక్షల వరకు ఓట్లు తొలగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇందులో డబుల్ ఎంట్రీలు, డెత్ ఓట్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

కళ్లు చెదిరే ఆస్తులు..

## రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణ అరెస్ట్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో తెలంగాణ రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. మాదాపూర్‌లోని డీఈ ఇల్లు సహా 8 ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి సోదాలు చేశారు. ఆయనకు శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో నాలుగు ఫ్లాట్లు, కూకట్‌పల్లిలో మూడంతస్తుల వాణిజ్య భవనం, గుట్టల బేగంపేటలో ఐదంతస్తుల భవనం ఉన్నట్లు గుర్తించారు. ఇంట్లో 2.09 కిలోల బంగారం, 3 కార్లు, బ్యాంకు ఖాతాల్లో రూ.52.02 లక్షలున్నట్లు తేలింది. ఆయన భార్య పేరుపై నాలుగు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు ఉన్నట్లు గుర్తించారు. ఆ సంస్థలు 10 అపార్ట్‌మెంట్లను నిర్మిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## ఆర్టీసీ బస్సును అపహరించి.. బీభత్సం

**18 కి.మీ. వెంబడించి పట్టుకున్న పోలీసులు**

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన బస్సు.. వెనుక వెంబడిస్తున్న పోలీసు వాహనాలు



కోరుట్ల, మెట్‌పల్లి పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ : బస్టాండులో నిలిపిన ఆర్టీసీ బస్సును ఓ ఆగంతుకుడు తీసుకెళ్లగా... పోలీసులు వెంబడించి 18 కిలోమీటర్ల దూరంలో పట్టుకున్నారు. ఈ దారిలో దుండగుడు మూడు ద్విచక్ర వాహనాలను, పోలీసు వాహనాన్ని సైతం ఢీకొట్టి బీభత్సం సృష్టించాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోనకు చెందిన టీఎస్08 జెడ్0103 నంబరు బస్సును డ్రైవర్ ప్రవీణ్ కోరుట్ల బస్టాండ్‌లోని 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై నిలిపి, కండక్టర్‌తో కలిసి పక్కకు వెళ్లారు. ఇంతలో గుర్తుతెలియని వ్యక్తి బస్సు ఎక్కి నడుపుకొంటూ నిజామాబాద్ వైపు తీసుకెళ్లాడు. గమనించిన ఆర్టీసీ ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మెట్‌పల్లి సర్కిల్‌లోని పోలీసులు, ఆర్టీసీ ఉద్యోగులు బస్సును పట్టుకునేందుకు వాహనాల్లో వెంబడించారు. దుండగుడు మధ్యలో కోరుట్ల, ఆరపేట, వెంకట్రావుపేటల వద్ద మూడు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టగా వాహనదారులు స్వల్పంగా గాయపడ్డారు. ఓ చోట బస్సును వెంబడిస్తున్న పోలీసుల వాహనాన్ని సైతం ఢీకొట్టడంతో.. ఆ వాహనం స్వల్పంగా దెబ్బతింది. పోలీసులు ఇబ్రహీంపట్నం ఠాణాకు సమాచారం ఇవ్వగా.. అక్కడి సిబ్బంది మెట్‌పల్లి మండల పరిధిలోని గండి హనుమాన్ సమీపంలో జాతీయ రహదారికి అడ్డుగా భారీ వాహనాలు నిలిపి ఉంచారు. దీంతో బస్సు ముందుకెళ్లే దారి లేక దుండగుడు పక్కనున్న చెట్టును ఢీకొట్టి నిలిపివేశాడు. పారిపోయే యత్నం చేయగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

## రామగుండం ఎన్టీపీసీ వద్ద రోడ్డు ప్రమాదం.. ఇద్దరి మృతి



రామగుండం, విశ్వం వాయిస్ న్యూస్ : పెద్దపల్లి జిల్లా రామగుండం ఎన్టీపీసీ క్రషర్‌నగర్ వద్ద తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. రోడ్డుపై ఆగి ఉన్న లారీని చత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న డీసీఎం వ్యాన్ అతివేగంగా వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ముందు భాగం నుజ్జునుజ్జు అయి డీసీఎంలో ఉన్న డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మరణించారు. డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కున్న వారిని పోలీసులు బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాద సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పనిచేస్తున్న సంస్థకే కన్నం..

**భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు**

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : బంజారాహిల్స్‌లో భారీ చోరీ కేసును టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. పనిచేస్తున్న సంస్థకే కన్నం వేసి కిలోకి పైగా బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సోదరులు సోంకాంబ్లే హరీశ్, సొంకాంబ్లే ఆకాశ్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. ఈ మేరకు వివరాలను ఆయన వెల్లడించారు. "ఓ జ్యువెలరీ సంస్థలో హరీశ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలపై నిందితుడు ముందే నిఘా పెట్టాడు. ఈనెల 16న చోరీకి యత్నించి విఫలమయ్యాడు. 17న విద్యుత్ సరఫరా నిలిపివేసి బాత్రూమ్ గ్రిల్స్ తొలగించి లోపలికి ప్రవేశించాడు. లాకర్‌లోని బంగారు ఆభరణాలను అపహరించాడు. దొంగిలించిన బంగారాన్ని సోదరుడు ఆకాశ్ వద్ద దాచిపెట్టాడు. నిందితులను అరెస్ట్ చేసి కిలోకు పైగా (1,028 గ్రాములు) బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నాం" అని డీసీపీ తెలిపారు.

## ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నం

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలో ఇండిగో ఉద్యోగినిపై క్యాబ్ డ్రైవర్ అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఇండిగో ఉద్యోగిని రోజు మాదిరిగానే రాత్రి విధులకు క్యాబ్‌లో ఇంటి నుంచి బయల్దేరారు. క్యాబ్ డ్రైవర్ శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలోకి కారును మళ్లించి అత్యాచారయత్నం చేశాడు. ఉద్యోగిని తీవ్రంగా ప్రతిఘటించడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనపై బాధితురాలు శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు అధికారులు ఉద్యోగుల రవాణా, భద్రతపై సమీక్ష నిర్వహించారు.



# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

**ప్రతి శాఖ సమన్వయంతో ప్రోటోకాల్ పాటిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచన : జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్**




**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పోలవరం జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐటిడిఎ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పర్యటన ఏర్పాట్లపై శాఖలవారీగా సమగ్రంగా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో ప్రాపర్ ఎర్తింగ్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బి శాఖ అధికారులు రహదారుల మరమ్మతులు, శుభ్రత, సూచిక బోర్డులు, డివైడర్లు తదితర పనులు పూర్తి చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్, వేదిక ఏర్పాట్లు, ప్రేక్షకుల రాకపోకలకు అనుకూలమైన మార్గాలు సిద్ధం చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ వద్ద భద్రతా ప్రోటోకాల్‌ను కచ్చితంగా అమలు చేయాలని, గుర్తింపు కార్డులు కలిగిన వారికి మాత్రమే ప్రవేశం కల్పించాలని, అక్కడ అవసరమైన విండ్ ఫ్లాగ్స్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రోటోకాల్‌కు అనుగుణంగా అంబులెన్స్‌లు, వైద్య బృందాలు, అత్యవసర చికిత్సా సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, సంబంధిత సిబ్బంది ప్రత్యేక టీ-షర్టులు ధరించి ప్రజలకు స్పష్టంగా కనిపించేలా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ శాఖ ద్వారా స్నేక్ క్యాచర్లను అందుబాటులో ఉంచాలని, రహదారులపై అడవి జంతువులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే రంపచోడవరం పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో పశువులు సంచరించకుండా ఆయా యజమానులు బాధ్యత వహించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా సరస్వతి దేవి విగ్రహం, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు సమర్పిస్తారని తెలిపారు. అనంతరం తల్లులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్‌లో పాల్గొని, సెల్ఫీ స్టాండ్ను సందర్శించడం, 9వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ముఖ్యమంత్రివర్యులు చీఫ్ సెక్యూరిటీ అధికారులు శ్రీనివాసరావు, యం. రాము,అడిషనల్ ఎస్పీ కె. శృతి, వీఆర్వో పి. అంబేద్కర్,ఆర్డిఓ కె. స్వాతి, డీఎస్పీ అస్రాఫ్ అలీ, ఆర్జీడీలు నాగమణి, శేఖర్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్యా, సబ్ డి ఎఫ్ ఓ అనుష, డీఈవో శ్రీరామ్ మూర్తి, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి సరిత, డి ఆర్ డి ఎ పి డి డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, పీహెచ్ఓ నరేంద్ర కుమార్, డి సి హెచ్ ఓ సాంబశివరావు, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్డెంట్ సుబ్రమణ్యం, తాసిల్దార్ సిహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, డిటిఓ రాజేష్ కుమార్, ఆర్టీసీ డిఎం మార్కెట్, జిల్లా సివిల్ సప్లై అధికారి విజయ భాస్కర్, దోమ పిడి రాంప్రసాద్, సివిల్ సప్లై డిఎం గణేష్ కుమార్, ఏపిడి శ్రీనివాస్ విశ్వనాథ్ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ శ్రీనివాసరావు, అచ్యుతరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**రంపచోడవరంలో విద్యాసంస్థలు, సభా వేదికను పరిశీలించిన ఉన్నతాధికారుల బృందం**
**సమన్వయంతో పనులు పూర్తి చేయాలని అధికారులకు పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదేశం**




**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఈ నెల 24న రాష్ట్ర ముఖ్యమంత్రి పోలవరం జిల్లా రంపచోడవరం పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, ముఖ్యమంత్రివర్యులు పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షకులు పెందుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర చైల్డ్ రైట్స్ సభ్యులు గాంధీ బాబు, రంపచోడవరం రెవిన్యూ డివిజనల్ అధికారి కె.స్వాతి, డి.ఎస్.పి శృతి, ఎస్డిపిఓ అశ్రఫ్ అలీ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. పోలవరం జిల్లా ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారిగా జిల్లాకు వస్తున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పాటు వివిధ శాఖల అధికారులు రంపచోడవరం సభా ప్రాంగణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పర్యటన నేపథ్యంలో తరగతి గదులను సందర్శించిన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ విద్యార్థులతో నేరుగా మమేకమై బోధనా విధానం, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు సులభంగా అర్థమవుతున్నాయా అనే అంశాలపై వారిని ప్రశ్నించి అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే విద్యార్థులకు పూర్తిగా అర్థమయ్యేలా ఒకటికి రెండుసార్లు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల వివరాలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీ.ఎల్.ఎం.) నమూనాలను పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించిన అధికారులు, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ, నిర్వహణ విధానాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న విద్యాసంస్థల్లో తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, డిజిటల్ క్లాస్‌రూములు, విద్యుత్, ఇతర మౌలిక వసతులను పరిశీలించిన అధికారులు, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన బృందం వేదిక నిర్మాణం, గ్యాలరీల ఏర్పాటు, వీఐపీ ప్రవేశ మార్గాలు, ప్రజల రాకపోకలు, భద్రత, పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేసింది. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, యాక్షన్ ప్లాన్ ప్రకారం అప్పగించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవిన్యూ అధికారి పి. అంబేద్కర్,ఆర్‌జేడీలు నాగమణి, టి. శేఖర్‌బాబు, డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, ఏజెన్సీ డీఈఓ వై. మల్లేశ్వరరావు, ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్, డి ఆర్ డి ఏ పి డి డాక్టర్ దాసరి రత్నాకర్ రావు, ఈ ఈ ఐ. శ్రీనివాసరావు ఎంఈఓలు కె.వి.వి. సత్యనారాయణ, శ్రీనివాసరావు, తహసీల్దార్ సి.హెచ్. బాలాజీ, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు జల్లి శంభుడు, జి. తులసీదాస్, కృష్ణమోహన్, ఏటీఓ బి. చిన్ని బాబు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ప్రసాద్, రాజేంద్ర కుమార్, సర్వే ఏడి శ్రీనివాసరావు,తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా, మండల ఆర్థికాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక పురోభివృద్ధికి ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో స్వర్ణాంధ్ర--2047 విజన్ లక్ష్యాల సాధనలో భాగంగా నిర్వహించిన జీడీడీపీ (గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్), జీఎండీపీ (గ్రాస్ మండల్ డొమెస్టిక్ ప్రొడక్ట్) అంచనాలపై సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల స్థాయిలో ఆర్థిక కార్యకలాపాలపై ఖచ్చితమైన గణాంకాలను సేకరించడం ద్వారా స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించే అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, పారిశ్రామిక, సేవారంగాల్లో సృష్టించబడుతున్న ఆర్థిక విలువను శాస్త్రీయంగా అంచనా వేయడమే జీడీడీపీ, జీఎండీపీ ప్రధాన లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన 'పది సూత్రాలు' అమలుకు ప్రతి శాఖ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, రైతు సంక్షేమం, నీటి భద్రత, పరిశోధన-అభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్, డీప్ టెక్నాలజీ వినియోగం వంటి



అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. నాణ్యమైన, విశ్వసనీయ గణాంకాలే ప్రభుత్వ నిర్ణయాలకు పునాదిగా నిలుస్తాయని, ప్రతి శాఖ ఖచ్చితత్వంతో డేటా సేకరించి శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, డీఆర్వో వి.సుబ్బారావు, ముఖ్య ప్రణాళికాధికారి జె.డి.సౌజన్య, ఏడీ రోహిణి కుమారి, సీపీవో మురళీకృష్ణ, ముంబై యూనివర్సిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ ఫైజాన్, శిక్షణ అనలిస్టులు, జిల్లా, మండల స్థాయి అధికారులు, గణాంక విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలను తీసుకుని వెళ్లే ఆటో డ్రైవర్లు

# బాధ్యతాయుతంగా మెలగాలి : డి.టి.ఓ,డీఎస్పీ



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రహదారి భద్రత అదేవిధంగా సామాజిక బాధ్యత ఆటో డ్రైవర్లు విధిగా పాటించాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, పట్టణ డి.ఎస్.పి ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక వాసర్ల గార్డెన్స్ నందు ఆటోరిక్షా డ్రైవర్లతో నిర్వహించిన "బడి పిల్లల భద్రత, బాధ్యత" కార్యక్రమంలో డీ.టీ.ఓ, డి.ఎస్.పి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లనుద్దేశించి డీ.టీ.ఓ మాట్లాడుతూ బడి పిల్లలను తీసుకుని వెళ్లే ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా మెలగాలని, లగేజి స్థానంలో పిల్లలను కూర్చోపెట్టి కేసుల రూపంలో కష్టాలు కొనితెచ్చుకోవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. డి.ఎస్.పి మాట్లాడుతూ సామాజిక బాధ్యత విషయంలో ఆటో డ్రైవర్లు తమ వంతు పాత్ర పోషించాలని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేది ఆటో సేవలు మాత్రమే అని అన్నారు. ముమ్మిడివరం, కొత్తపేట, మలికిపురం ప్రాంతాల్లో త్వరలోనే సమావేశాలు నిర్వహిస్తామని డీ.టీ.ఓ తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ ఒక్క రోడ్డు ప్రమాదానికి కూడా ఆస్కారం ఇవ్వకుండా క్రమశిక్షణతో మసలిన ఇద్దరు ఆటో డ్రైవర్లను శాలువా కప్పి అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ కిషోర్, ఆటో యూనియన్ అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వాడపల్లి దేవస్థానానికి శాశ్వత మాస్టర్ ప్లాన్ రూపొందించాలి




**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు శాశ్వత మాస్టర్ ప్లాన్ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ఆత్రేయపురం మండలం వాడపల్లి దేవస్థానం సమావేశ మందిరంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, అడిషనల్ డీఎస్పీ మహేంద్ర, ఆలయ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకటరాజుతో కలిసి దేవస్థానం అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన డీపీఆర్‌ను ఆగస్టు 25లోపు సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి సముదాయాలు, పార్కింగ్, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, వరద నీటి ప్రవాహ మార్గాలు, కోశాగారాలు తదితర మౌలిక సదుపాయాలను శాస్త్రీయ ప్రణాళికతో అభివృద్ధి చేయాలని సూచించారు.అభివృద్ధి పనులను తక్షణ, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించి అమలు చేయాలని, రాబోయే 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేవస్థాన భూముల రక్షణ, ఆక్రమణల తొలగింపు, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా ఆదేశించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ వాడపల్లి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బస్సు షెల్టర్లు, ఆర్చ్‌లు, పార్కింగ్, తాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సూచించారు. పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో అమలు చేయాలని ఆదేశించారు.అలాగే సాగునీటి పంపిణీపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, ఎగువ ప్రాంతాల్లో ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని, వాడపల్లి దేవస్థానం బ్రిడ్జి వద్ద అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ నిర్మాణ సాధ్యతను పరిశీలించాలని సమావేశంలో ప్రతిపాదించారు.సమావేశంలో కొత్తపేట ఆర్‌డీఓ సత్యనారాయణ, డీఎస్పీ సుంకర మురళీమోహన్, దేవస్థానం ఈవో చక్రధర్‌రావు, పర్యాటక అభివృద్ధి అధికారి అన్వర్ హుస్సేన్, డీపీఓ శాంతికుమారి, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# వెల్ల గ్రామంలో 'పొలం పిలుస్తుంది'

**పంటల బీమాపై రైతులకు అవగాహన**



**వెల్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండల పరిధిలోని వెల్ల గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సబ్ డివిజన్ ఏడీఏ ఎం.అరుణ, మండల వ్యవసాయ అధికారి టీ.మణిదీప్ పాల్గొని క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులతో నేరుగా చర్చించారు. ప్రస్తుతం పంట నారుమడి చివరి దశ నుంచి ఊడ్చే దశలో ఉన్నందున, ఈ కీలక సమయంలో తీసుకోవాల్సిన ఎరువుల యాజమాన్యం మరియు సస్యరక్షణ చర్యలపై రైతులకు దిశానిర్దేశం చేశారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, సాగునీటి విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నీటి పారుదలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే వ్యవసాయ శాఖ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎల్ నినో ప్రతికూల పరిస్థితుల వల్ల నష్టం వాటిల్లకుండా ఉండేందుకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభమైందని తెలిపారు. ఖరీఫ్ 2026కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యంత్రాంగం ద్వారా వరి పంటకు టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కంపెనీని కేటాయించారు. వరి పంటకు హెక్టారుకు రూ.95,000 బీమా వర్తిస్తుండగా, రైతులు కేవలం 0.2% ప్రీమియం అనగా ఎకరానికి రూ.76 (హెక్టారుకు ?రూ.190) చెల్లించి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. బీమా నమోదుకు చివరి తేదీ ఆగస్టు 15, 2026 వరకు అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!
నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!
- బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel
మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి
JOIN NOW
లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E
మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



# కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలను ప్రతి ఇంటికీ చేర్చాలి

## ఈ నెల 27 నుంచి నెల రోజులపాటు డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన చారిత్రాత్మక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలనను ప్రతి ఇంటికి చేరవేసే లక్ష్యంతో ఈ నెల 27వ తేదీ నుంచి నెల రోజులపాటు నిర్వహించనున్న "కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు" డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సవివరంగా వివరించాలని సూచించారు. అదేవిధంగా ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే వారధిగా ప్రతి కార్యకర్త బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ప్రజలతో ఆత్మీయంగా మమేకమవుతూ ప్రభుత్వంపై వారి విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే విధంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శక, ప్రజాకేంద్రీకృత పాలన సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు, పెట్టుబడుల ఆకర్షణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలతో పాటు, భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి ప్రణాళికలను కూడా ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రజల ఆశయాలే ప్రభుత్వ లక్ష్యం... ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అనే భావనతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేసి ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, రామచంద్రపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, క్లస్టర్, కో కస్టర్, బూత్, డివిజన్, వార్డు కమిటీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

#### నడిపూడి వంటకాలువలో

# పూడిక తొలగింపు పనులు పరిశీలించిన కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్, కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)తో కలిసి ముక్కామల–ఈదరపల్లి రహదారి పరిధిలోని నడిపూడి వద్ద వంటకాలువలో చేపడుతున్న పూడిక, కలుపు మొక్కల తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా పూడికతో పాటు కలుపు మొక్కలను పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ బి. శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

#### జి.ఓ. 396 రద్దు చేయాలని

# ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం

### ప్రైవేటీకరణ నిలిపివేయాలని దస్తావేజు లేఖర్ల డిమాండ్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జి.ఓ. నెం. 396ను రద్దు చేసి, రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరుతూ అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావుకు దస్తావేజు లేఖర్లు, సహాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం అమలాపురం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షుడు గుంటు ఫణిప్రసాద్, కార్యదర్శి పందిరి హరి, జాయింట్ సెక్రటరీ పెద్దిరెడ్డి దుర్గేష్, వెదులపల్లి సుబ్బు, గనిశెట్టి బోగిరాజు, అడపా భూషణం, బొర్రా బుజ్జి, కడలి సత్యనారాయణ, దేగల రాజా, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వి శ్రీను, గుమ్మల నరేష్, బంద్రెడ్డి రాజు, కె.వి. నాగరాజుతో పాటు పలువురు దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ముద్రగడ సేవలు మరువలేనివి

### పద్మనాభం సంతాప సభలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామంలో నిర్వహించిన సంతాప సభలో శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు పాల్గొని ప్రసంగించారు. కాపు జాతి సంక్షేమం కోసం సాగించిన పోరాటాలు, అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. 1978లో శాసనసభ్యుడిగా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటివరకు జీవితాన్ని ప్రజల కోసం, కాపుల సంక్షేమం కోసం త్యాగం చేశారని గుర్తుచేశారు. 1993 నుండి సాగించిన ఉద్యమ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమైనదని తెలిపారు. ప్రస్తుతం కాపు విద్యార్థులు పొందుతున్న స్కాలర్‌షిప్‌లు, అందుబాటులోకి వచ్చిన కాపు కార్పొరేషన్ వంటి ఫలాలు చేపట్టిన ఆమరణ దీక్షలు, పోరాటాల ఫలితమేనని పేర్కొన్నారు. కాపు సామాజికవర్గంతో పాటు బడుగు, బలహీన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన నిజాయితీ గల నాయకుడని కొనియాడారు. ఏ రిజర్వేషన్ల సాధన కోసం జీవితాంతం ఉద్యమాలు జరిగాయో, ఆ రిజర్వేషన్లను అమలుపరిచే దిశగా రాష్ట్రంలోని కాపు నాయకులందరూ కలసికట్టుగా ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రయత్నంలో తాను అన్ని విధాలా సహకరించి ముందుంటానని హామీ ఇచ్చారు. ఆ లక్ష్యాన్ని సాధించడమే అందించే నిజమైన ఘన నివాళి అని స్పష్టం చేశారు.

#### విద్యార్థులపై పోలీసు దాడులకు నిరసనగా

# రామచంద్రపురంలో ప్రజా సంఘాల ధర్నా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం స్థానిక ప్రధాన రహదారిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ ప్రజా విద్యార్థి మరియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ జాతీయ స్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్ష 2026 ప్రశ్నాపత్రం లీకేజీ, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా గత మూడు నెలలుగా పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతుగా దేశ రాజధానిలో గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేపడుతున్న రామన్ మెగసెసే అవార్డు గ్రహీత సోనమ్ వాంగ్‌చుక్‌ను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసి దీక్షను భగ్నం చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బాష్పవాయు ప్రయోగం చేయడం, లాఠీచార్జ్ చేయడం దారుణమని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ప్రభుత్వం బలప్రయోగానికి దిగుతోందని మండిపడ్డారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ రామచంద్రపురం పట్టణ కార్యదర్శి పి. రాము మరియు భారత వర్కర్స్ యూనియన్ కేంద్రం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ, కష్టపడి చదివే విద్యార్థులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పరీక్షల విశ్వసనీయత దెబ్బతింటే ప్రతిభకు అన్యాయం జరిగి దేశ ప్రజల ఆరోగ్య భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌తో వెంటనే చర్చలు జరపాలని, విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే మరణించిన విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం అందించాలని లీకేజీకి కారణమైన వారిని కఠినంగా శిక్షించి పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విద్యార్థి, కార్మిక మరియు ప్రజా సంఘాల నాయకులు నవీన్, సురేష్, శ్యామ్, విజయ్, మణిదీప్, మేడిశెట్టి దుర్గా, సత్తిబాబు, సూర్యకుమారి, శారద, బాబ్జి, సత్యనారాయణ, అప్పారావు, అంబటి కృష్ణ, హరి, ఆలీ తదితర కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై దాడి

### ఏడుగురు అరెస్ట్ నగదు స్వాధీనం..




**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం తానే లంక సమీపంలో పేకాట శిబిరంపై ముమ్మిడివరం పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.19600/- రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తానేలంకలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు ముమ్మిడివరం ఎస్సై బి.శివకృష్ణ కు సమాచారం రావడంతో మంగళవారం రాత్రి ఆయన పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురు వ్యక్తులు దంగేటి శ్రీనివాసరావు,గుత్తుల ప్రసాద్, గోదాశి నాగకృష్ణమూర్తి, మెండ శ్రీనివాస్, చప్పిడి సత్యనారాయణ, శేట్ విక్రమ్ కుడిపూడి హరికృష్ణ లను అదుపులోకి తీసుకున్నారు. మండలంలో ఎక్కడ పేకాట జూదం వంటి చట్ట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివకృష్ణ హెచ్చరించారు.

#### నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా

# 24న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ స్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్ష 2026 ప్రశ్నాపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని విద్యార్థులకు పూర్తి న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధు డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా, విద్యార్థులు మరియు యువతపై జరుగుతున్న అక్రమ నిర్బంధాలను ఖండిస్తూ దేశ రాజధానిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జీ, దమనకాండకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జూలై 24న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ బంద్‌లో ప్రాథమిక పాఠశాల స్థాయి నుండి ఉన్నత విద్య వరకు అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువజన సంఘాలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాసంస్థల యాజమాన్యాలు మరియు తల్లిదండ్రులు ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

#### రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో

# బాలికలకు రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన

### ఆశా వర్కర్లకు ఘన సన్మానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో జూలై నెల సేవా కార్యక్రమాల్లో భాగంగా అమలాపురం లోని నల్లవంతెన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత అవగాహన కార్యక్రమం (మెన్స్ట్రువల్ సైకిల్ హైజీన్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్) నిర్వహించడంతో పాటు ఆశా వర్కర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ నాగ మానస ముఖ్య అతిథిగా హాజరై బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, పోషకాహారం, అపోహలు-వాస్తవాలు, మానసిక ఆరోగ్యం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రతి బాలిక ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఆమె వివరించారు. అనంతరం సమాజ ఆరోగ్య పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను రోటరీ క్లబ్ అమలాపురం తరఫున ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్.డి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, సమాజ ఆరోగ్యాభివృద్ధికి ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని అన్నారు. మహిళలు, బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం రోటరీ క్లబ్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆకుల రాము, ఆసక్తి శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. గౌరీశంకర్, రోటరీ క్లబ్ కోశాధికారి శశిధర్ శ్రీరాం, రోటరీ సభ్యులు వాడ్రేవు శ్రీరాం, మూల రవితేజ, కర్రా బాబీ, వాడ్రేవు శ్రీవాణి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో రోటరీ క్లబ్ కార్యదర్శి ఆకొండి పవన్ మాట్లాడుతూ, సమాజ సేవలో రోటరీ చేపట్టే కార్యక్రమాలకు ప్రజల సహకారం ఎల్లప్పుడూ అవసరమని పేర్కొంటూ, కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

#### విద్యా వ్యవస్థలో


# విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న కూటమి ప్రభుత్వం

### తల్లికి వందనం పథకంతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట
### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రాధాన్యతగా తీసుకుని విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. "తల్లికి వందనం" పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయడం ద్వారా విద్యకు మరింత ప్రోత్సాహం అందిస్తున్నామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో మొత్తం 67.47 లక్షల మంది విద్యార్థులకు రూ.10,120.78 కోట్ల ఆర్థిక సాయం అందించబడిందని పేర్కొన్నారు. విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకుండా చూడటమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. గత వైసిపి ప్రభుత్వం అర్హులైన విద్యార్థులకు ఇవ్వకుండా దగా చేసిందని ఈ సందర్భంగా విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో విద్యా రంగంలో నాణ్యత పెంపు, ఆధునిక సదుపాయాల కల్పన, డిజిటల్ విద్యా వ్యవస్థ బలోపేతం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించడం, సాంకేతిక విద్యను ప్రోత్సహించడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారి అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# సముద్రపు మొగ పూడిక తొలగింపు ఎప్పుడు?




**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల సరిహద్దులో ఉన్న సముద్రపు మొగ మూసుకుపోయి ఏళ్లు గడుస్తుంది. ఈ మొగ నుంచి వచ్చే నీరు వల్ల మత్స్య సంపద విపరీతంగా లభిస్తుంది. దీనిపై మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. వీరి జీవనోపాధికి గండిపడడంతో చాలామంది ఇతర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై ఇటీవల మత్స్యకారులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే సైతం అసెంబ్లీలో మాట్లాడారు.

#### ద్రాక్షారామంలో విద్యుత్ ప్రమాదం

# వెలంపాలెం యువకుడు మృతి



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన ద్రాక్షారామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వెలంపాలెం గ్రామానికి చెందిన యడ్ల రామ ఆంజనేయులు (33) ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర విద్యుత్ ఘాతానికి గురికావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా, పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు. ముక్కుపచ్చలారని యువకుడు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడంతో వెలంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



# కాజులూరు మండలంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

## ప్రభుత్వ కార్యాలయాల పరిశీలించిన హరేంధీర ప్రసాద్





**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండల గ్రామాల్లో బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధీర ప్రసాద్ సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ మేరకు గొల్లపాలెం, ఆర్యవటం, చేదువాడ, కాజులూరు గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాల అమలు తీరును పరిశీలించడం తో పాటు పలు కీలక శాఖల కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ పర్యటనలో భాగంగా తొలుత గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ రిజిస్ట్రేషన్, మందుల నాణ్యత, పంపిణీ తీరును పరిశీలించడంతో పాటు వివిధ వార్డులను తనిఖీ చేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవలపై కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం సీపీడబ్ల్యూఎస్ పథకంలో భాగంగా గొల్లపాలెం చెరువును పరిశీలించారు. కాజులూరు, కరప మండలాల్లోని సుమారు 30 గ్రామాలకు ఈ చెరువు ద్వారా అందుతున్న తాగునీటి సరఫరా, ఫిల్టరేషన్ ప్రక్రియను పరిశీలించి స్థానిక అధికారులతో చర్చించారు. మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్యవటంలోని స్వర్ణ గ్రామపంచాయితీ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించడంతో పాటు, కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవల వివరాలు, పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్ నివేదిక, గ్రామంలోని పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలపై ఆరాతీశారు. చేదువాడ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడ చిన్నారులతో ముచ్చటించి, వారు అభ్యసించిన కృత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు మెరుగైన, నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఎల్లప్పుడూ సకాలంలో అందించాలనినిర్వాహకులకు సూచించారు. కాజులూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద అందుతున్న మధ్యాహ్న భోజన తయారీ విధానం, కిచెన్ షెడ్డును తనిఖీ చేశారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల వసతుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థుల తో ముచ్చటించి వారి విద్యా సామర్థ్యాలనుపరిశీలించారు. గత పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. 10వ తరగతి విద్యార్థులను ఇప్పటి నుంచే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు కలెక్టర్ గట్టి ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో కాజులూరు తహశీల్దార్ టి.ఠాగూర్, ఎంపీడీవో జే.రాంబాబు, ఆర్ఐ వేగేశ్వరరావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శానిటేషన్ రిక్షాలు పంపిణీ చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శానిటేషన్ రిక్షాల పంపిణీ కార్యక్రమంలో కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధుల ద్వారా మంజూరైన 24 శానిటేషన్ రిక్షాలను కరప మండలంలోని 11 గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే నానాజీ వారి చేతుల మీదుగా సంబంధిత గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శానిటేషన్ రిక్షాల ద్వారా ఇరుకైన గ్రామ సందులలో కూడా చెత్తను సేకరించడానికి సులభంగా ఉంటుందని, గ్రామ పంచాయతీల పరిశుభ్రత మరియు ప్రజారోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అలాగే ప్రజలందరూ తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు చప్పిడి వెంకటేశ్వర రావు , పెంకే శ్రీనివాస్ బాబా , బండారు మురళి , దేవు వెంకన్న , భోగిరెడ్డి కొండబాబు , నల్లే ప్రసన్న కుమార్ , నురుకుర్తి వెంకటేశ్వర రావ , రాంబాల వెంకటేశ్వర రావు, పితాని లీలా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండు గోవిందు,గొల్లపల్లి చంద్ర శేఖర్, సైనవరపు భవాని శంకర్ దూడల నారాయుడు , గంటా వీరయ్య చౌదరి (వీరబాబు) , వాసిరెడ్డి సత్తిబాబు , వెలుగుబంట్ల సూరిబాబు, పుణ్యమంతుల సింహాద్రమ్మ అన్నవరం, పబ్బినీడి పద్మావతి ప్రసాద్ , యాళ్ల పండు, పేకేటి దుర్గా ప్రసాద్, పేపకాయల వెంకట రమణ, గంట నానీబాబు, భాస్కర్ తమ్మయ్య, సింగంపల్లి నాగేశ్వరావు,సంభంధిత శాఖల అధికారులు, పంచాయతీ సిబ్బంది, కూటమి గ్రామ కమిటీ అధ్యక్షులు, జనసైనికులు, వీరమహిళలు మరియు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత, సామాజిక బాధ్యత

# విధిగా పాటించాలి : డీటీఓ, డీఎస్పీ







**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రహదారి భద్రతతో పాటు సామాజిక బాధ్యతను ఆటో డ్రైవర్లు విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు, పట్టణ డీఎస్పీ ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆటోరిక్షా డ్రైవర్లతో నిర్వహించిన "బడి పిల్లల భద్రత - బాధ్యత" కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బడి పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. లగేజీ కోసం ఉద్దేశించిన స్థలంలో పిల్లలను కూర్చోబెట్టి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పట్టణ డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ, సామాజిక బాధ్యత విషయంలో ఆటో డ్రైవర్లు తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. ప్రజలకు అన్ని సమయాల్లో అందుబాటులో ఉండే రవాణా సేవల్లో ఆటో సేవలు ముఖ్యమైనవని పేర్కొన్నారు. ముమ్మిడివరం, కొత్తపేట, మలికిపురం ప్రాంతాల్లో కూడా త్వరలో అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా రవాణా అధికారి తెలిపారు. గత 25 సంవత్సరాలుగా ఆటో నడుపుతూ ఒక్క రోడ్డు ప్రమాదానికీ ఆస్కారం ఇవ్వకుండా క్రమశిక్షణతో సేవలందించిన ఇద్దరు ఆటో డ్రైవర్లను అధికారులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిషోర్, ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖరుల పొట్ట కొట్టొద్దు

**ముమ్మిడివరంలో 3వ రోజుకు చేరిన దస్తావేజు లేఖరుల నిరసన దీక్ష**
**జీవో 396 పై సీఎం, డిప్యూటీ సీఎంలు చొరవ చూపాలి: దస్తావేజు లేఖరుల విజ్ఞప్తి**



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన జీవో నంబర్ 396 వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 5 లక్షల మంది దస్తావేజు లేఖరుల (డాక్యుమెంట్ రైటర్ల) ఉపాధి పూర్తిగా దెబ్బతింటుందని, అందువల్ల ఈ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరంలో చేపట్టిన నిరసనలు బుధవారం నాటికి ఉధృతంగా మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం నేత చవటపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకురావాలని చూస్తున్న ఆర్ఎస్కే (రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు) విధానం వల్ల తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని బతుకుతున్న లక్షలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రిజిస్ట్రేషన్ కార్యాలయం ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి దాదాపు రెండు కోట్ల రూపాయల భారీ ఆదాయం సమకూరుతుందని, ఆ నిధులతోనే వ్యవస్థలను ఆధునీకరించి అభివృద్ధి చేయాలే తప్ప లేఖరుల పొట్టకొట్టడం సరికాదని ఆయన హితవు పలికారు. ఎంతో శ్రమతో కూడిన భూ సర్వే పనులు, సంక్లిష్టమైన పేపర్ వర్క్ చేస్తూ రెండు రోజుల పాటు కష్టపడితే ఒక డాక్యుమెంట్‌పై కేవలం రూ. 2000 మాత్రమే లభిస్తుందని, ఆ అరకొర సంపాదనలోనే డీటీపీ ఖర్చులు, విద్యుత్ బిల్లులు, ఆఫీస్ అద్దెలు భరించాల్సి వస్తోందని వివరించారు. కేవలం ముమ్మిడివరం నియోజకవర్గ కేంద్రంలోనే ఈ పనిపై ఆధారపడి 50 మందికి పైగా పనిచేస్తున్నారని, ఉన్నఫళంగా తమను తప్పుకోమంటే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. కావున, ప్రజా పక్షపాతులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు మానవీయ కోణంలో స్పందించి, చొరవ తీసుకుని జీవో 396ను తక్షణమే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో తాడాల వీరబాబు, సలాది చిట్టిబాబు, దొమ్మేటి గాంధీ, అయినాపురపు గోపాలకృష్ణ, గాలిదేవర సురేష్ తదితర ప్రముఖ దస్తావేజు లేఖరులతో పాటు, పెద్ద సంఖ్యలో సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలనపై డోర్ టు డోర్ సర్వేను

# విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు ముమ్మిడివరం శాసనసభ్యుల కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 27వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించనున్న ఇంటింటికీ (డోర్ టు డోర్) సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ప్రజలకు సమర్థవంతంగా వివరించాలని సూచించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో వివిధ అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయా అంశాలను ఆన్‌లైన్ తీర్మానాల రూపంలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుత్తుల సాయి, చెల్లి వివేకానంద, నియోజకవర్గ పరిశీలకురాలు సుంకర పావని, ఇతర ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి సహకరించాలి

**పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ కుమారి**
**మంచినీటి పైప్‌లైన్ పనులకు అడ్డంకులు కలిగిస్తున్నారంటూ ఆరోపణ**





**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ అభివృద్ధి పనులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ కుమారి పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు సూర్యారావుపేటకు చెందిన మల్లె కొండ, ఆయన భార్య మల్లె పద్మ (అలియాస్ బుజ్జమ్మ) నిరంతరం ఆటంకం కల్పిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పనులకు అడ్డుపడేవారిపై అవసరమైతే పోలీసులకు కూడా ఫిర్యాదు చేయడానికి వెనకాడబోమని ఆమె స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై గ్రామంలోని కూటమి నాయకులు కూడా స్పందిస్తూ.. వ్యక్తిగత స్వార్థాలను పక్కనపెట్టి, ఊరి అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# వేళంగిలో ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం వేళంగి గ్రామంలో డాక్టర్ బోండా వెంకన్న రావు, జనసేన నాయకులు డాక్టర్ బోండా సూర్యారావు సమక్షంలో శ్రీ నర్సింగ్ హోమ్ ఆవరణలో రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరానికి వేలంగి మరియు పరిసర ప్రాంత ప్రజల నుండి విశేష స్పందన లభించింది. సుమారు 20కిపైగా వైద్యులను సమీకరించి అన్ని విభాగాల నిపుణులతో ఉచిత వైద్య సేవలు అందించారు. క్యాన్సర్ టెస్టులను నిర్వహించారు. రోటరీ క్లబ్ ప్రతినిధి బదిరెడ్డి వెంకన్న స్వగ్రామం వేళంగి కావడంతో పర్యవేక్షించి ఏర్పాట్లు చేశారు. అధునిక పరికరాలతో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా సుమారు రెండు లక్షల రూపాయలు మందులు అందజేశారు. శిబిరంలో యూరాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, జనరల్ ఢ క్యాన్సర్ సర్జరీ, డెంటల్, గైనకాలజీ, చర్మవ్యాధులు, ఈఎన్‌టీ, నేత్ర, న్యూరో, నెఫ్రాలజీ, పల్మనాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఫిజియోథెరపీ తదితర విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు అందించారు.కిమ్స్ ట్రస్ట్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో గుండె సంబంధిత పరీక్షలు, ల్యాబ్‌నోవా సహకారంతో రక్తం, మూత్రం తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచిత మందులు, వైద్య సలహాలు అందజేశారు. వైద్య సేవలు అందించిన వైద్యుల్లో డా. ఎన్.వి.ఎస్. రావు, డా. సి.హెచ్.వి.ఎస్. రామకృష్ణ, డా. బొండా సూర్యారావు, డా. సత్తి సందీప్, డా. వి.ఎన్.వి. సతీష్, డా. పి.పి. శివరామ్, డా. ఎం. ఫణి రమణ భూషణ్, డా. సోనా త్రివేణి, డా. సురేష్, డా. డి. శేఖర్‌బాబు, డా. రావుల శ్రీరామ్, డా. పత్తి సునీత, డా. జ్యోత్స్న సునీత, డా. నాగ గీతిక, డా. సారయ్య, డా. ఆదిత్య ప్రసన్న కుమార్, డా. వేణుగోపాల సత్యరాజు, డా. ఎం. నివేదిత, డా. బి. సాయి శ్రీకృతి తదితరులు పాల్గొని సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు రొటేరియన్ ఎర్రమల్లి సత్యనారాయణ, ముఖ్య అతిథి పీడీజీ రొటేరియన్ ఎన్.వి.ఎస్. రావు, రొటేరియన్ బదిరెడ్డి వెంకన్న, రొటేరియన్ డాక్టర్ చింతా వెంకన్న రాజు, రొటేరియన్ వి.ఎన్.వి. సతీష్ రాజు, రొటేరియన్ ఎం.ఎస్.వి. కృష్ణారెడ్డి, రొటేరియన్ వి.వి. ఆదిత్య, రొటేరియన్ నల్లమిల్లి ముచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య బృందం, రోటరీ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు విశేషంగా కృషి చేశారు.

# ఇంటింటి ప్రచారాన్ని విజయవంతం చేయాలి

**ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, అమలాపురం నియోజకవర్గ వ్యాప్తంగా జూలై 27 నుంచి ప్రారంభం కానున్న "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. అమలాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతి బుధవారం నిర్వహించే క్యాడర్ క్యాలెండర్ సమావేశంలో భాగంగా క్లస్టర్, యూనిట్, బూత్ (సీ.యూ.బీ.) ఇన్‌ఛార్జ్‌లతో ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, ప్రచార కార్యక్రమంపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో రోజుకు కనీసం 30 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ప్రజల అభిప్రాయాలను సేకరించి, ప్రతి ఇంటి వద్ద తీసిన ఫొటోలను మై టీడీపీ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు ఆర్థిక చేయూత అందించడంతో పాటు, ఉచిత ఇసుక విధానం, ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ సరఫరా వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడం, అమరావతి రాజధాని నిర్మాణం, క్వాంటమ్ వ్యాలీ, అమరావతి-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే, వివిధ జిల్లాల్లో పరిశ్రమల స్థాపన, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల అభివృద్ధి వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జూలై 27 నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి ప్రచార కార్యక్రమంలో సీ.యూ.బీ. ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ సీ.యూ.బీ. ఇన్‌ఛార్జ్‌లు పాల్గొన్నారు.

దేశ బలగాలపై విచక్షణా రహితంగా దాడులు చేస్తున్న

# వీళ్లు విద్యార్థులా దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ వాదులా : పాలూరి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ బలగాలపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్న వీళ్లు విద్యార్థులా? విద్యార్థుల ముసుగులో ఉన్న దేశ వ్యతిరేక శక్తులతో కలిసి కాంగ్రెస్ వికృత చర్యలుబీజేపి రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాలూరి విద్యార్థుల పరీక్ష పేపర్ లీకులపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని పాలూరి సత్యానందం అన్నారు. నీట్ పరీక్షలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు నివేదికలు అందిన వెంటనే తక్షణ చర్యలు తీసుకొని, పేపర్ లీకుకు కారణమైన 13 మందిని అరెస్టు చేసి జైల్లో ఉంచడం జరిగిందని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యమిస్తూ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తే, విద్యార్థులు రీ-ఎగ్జామ్ రాసి కౌన్సిలింగ్‌కు వెళ్లారని, ర్యాంకు వచ్చినవారు సీటు కోసం క్యూ కట్టారని, ర్యాంకు రానివాళ్లు లాంగ్ టర్మ్ ప్రిపరేషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకోసం చదువుల్లో నిమగ్నమై ఉంటే, విద్యార్థుల ముసుగు వేసుకొని ధర్నాలలో పాల్గొంటున్న ఈ విద్యార్థులు ఎవరో కాంగ్రెస్ నాయకులకే ఎరుకని ఎద్దేవా చేశారు. యుపీఏ పాలనలో లీకులకు, స్కాంలకు పుట్టినిల్లయిన కాంగ్రెస్ నాయకులు ఆ చరిత్రను మర్చిపోయి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. అంతేకాకుండా, ప్రధాని మోదీని పిరికివాడని, అమిత్ షాను చేతకానివాడంటూ విమర్శించడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పాలూరి మండిపడ్డారు.



# మూడు నెలల్లో మరో మెగా ఉద్యోగ మేళా

## యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు : గోరంట్ల బుచ్చయ్య చౌదరి






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మరో మూడు నెలల్లో భారీ స్థాయిలో మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రకటించారు. బొమ్మూరులో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగ మేళాకు వచ్చే అభ్యర్థులకు అవసరమైన ఏర్పాట్లు వ్యక్తిగతంగా కూడా చేస్తామని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించిందని, 14 సంస్థలు పాల్గొని సుమారు 1,600 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ముందుకు వచ్చాయని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఉద్యోగ మేళాలను నిర్వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు వెనుకంజ వేయగా, ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులు పెరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రానికి రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుండటంతో కొత్త పరిశ్రమలు ఏర్పడి యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. నక్కపల్లి, కడప ప్రాంతాల్లో ఉక్కు పరిశ్రమలు, అలాగే వాహనాలు, సెల్‌ఫోన్ తయారీ, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలంటే యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అందుకోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యా సామగ్రి అందించడం, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం వంటి చర్యలతో విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. చదువు పూర్తిచేసిన యువతకు రాష్ట్రంలోనే ఉపాధి లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధి కోసం రాష్ట్ర యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా ఉద్యోగాల కోసం ఇక్కడికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ గోరంట్ల రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మరో మూడు నెలల్లో మరింత పెద్ద ఎత్తున మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. మజ్జి పద్మావతి మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోందన్నారు. యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్ని వాసుదేవ్, వెలుగుబంటి సత్యప్రసాద్, మత్సేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, గంగిన హనుమంతరావు, పిన్నమరెడ్డి ఈశ్వరుడు, నన్ను కృష్ణ, కురుకూరు కిషోర్, అడ్డాల శ్రీను, శిరీష, హరి శేషు, కిరణ్, రవికుమార్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఏసీసీఏ-నన్నయ విశ్వవిద్యాలయం

# ఎంవోయూ దిశగా అడుగులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రొఫెషనల్ అకౌంటెన్సీ సంస్థ ఏసీసీఏ (అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్) మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే దిశగా ప్రాథమిక చర్చలు జరిగాయి. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్న శ్రీ ఆదేశాల మేరకు వాణిజ్య, నిర్వహణ అధ్యయనాల విభాగం అధ్యాపకులతో ఏసీసీఏ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రొఫెషనల్ విద్య, అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల ఉపాధి అవకాశాల విస్తరణతో పాటు పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య సమన్వయం పెంపొందించడంపై చర్చించారు. ఏసీసీఏ సీనియర్ బిజినెస్ రిలేషన్‌షిప్ మేనేజర్ కె.రోయిస్టన్ మాట్లాడుతూ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల నైపుణ్యాలు అందించడంతో పాటు అకౌంటింగ్, ఫైనాన్స్, సుస్థిర అభివృద్ధి, డిజిటల్ పరివర్తన, వ్యాపార నాయకత్వం వంటి రంగాల్లో తాజా పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని తెలిపారు. 1904లో స్థాపితమైన ఏసీసీఏ ప్రస్తుతం 180 దేశాల్లో 2.57 లక్షలకుపైగా సభ్యులు, 5.30 లక్షలకుపైగా భవిష్యత్ సభ్యులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ ప్రొఫెషనల్ అకౌంటెన్సీ సంస్థగా గుర్తింపు పొందిందని వివరించారు. ఈ ప్రతిపాదిత భాగస్వామ్యంలో భాగంగా అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమాలు, కార్యనిర్వాహక శిక్షణలు, సదస్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అతిథి ఉపన్యాసాలు, మాస్టర్ క్లాస్‌లు, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాలు, పరిశ్రమలతో పరస్పర చర్చలు, విద్యార్థుల భాగస్వామ్య కార్యక్రమాల నిర్వహణకు అవకాశాలపై చర్చించారు. సమావేశంలో వాణిజ్య, నిర్వహణ అధ్యయనాల విభాగ అధ్యాపకులు ఎన్. ఉదయ్ భాస్కర్, ఉమామహేశ్వరి దేవి తదితరులు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం డోర్ టు డోర్

## కార్యక్రమంను విజయవంతం చెయ్యాలి : ఎమ్మెల్యే వేగుళ్ల



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం, ప్రతీ వార్డులో అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పిలుపు ఇచ్చారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు నియోజక వర్గ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రతీ నెల మూడవ బుధ వారం నిర్వహించే నెలవారీ సమన్వయ సమావేశం మండపేట పట్టణంలోని తెలుగు దేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెయే వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పార్టీ ప్రత్యేక పరిశీలకులు (అబ్జర్వర్) గా తుమ్మల సునీత ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూఈ నెల 27వ తేదీ నుండి ప్రారంభం కానున్న "కూటమి ప్రభుత్వం - 2 ఏళ్ళ నమ్మకం డోర్ టు డోర్" ప్రచార కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం, ప్రతీ వార్డులో అత్యంత వైభవంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ఫలాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతీ ఇంటి గుమ్మానికీ తీసుకెళ్ళి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అలాగే ఇటీవల చేపట్టిన సర్ కార్యక్రమాన్ని రాత్రింబవళ్ళు శ్రమించి, క్షేత్రస్థాయిలో అత్యంత విజయవంతంగా పూర్తి చేసిన వారందరికీ ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం పార్టీ అబ్జర్వర్ తుమ్మల సునీత మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మండపేట నియోజకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ఒక యజ్ఞంలా భావించి సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగబాబు, రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, రాష్ట్ర కుమ్మరి సాలివహన కార్పొరేషన్ డైరెక్టర్ మాచవరపు విజయకుమారి, రాష్ట్ర టిఎన్ టియుసి అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, అమలాపురం టిడిపి పార్లమెంట్ వాణిజ్యవిభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 18న రెడ్‌క్రాస్ జిల్లా సర్వసభ్య సమావేశం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆగస్టు 18న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు, కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. వై జంక్షన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా మేనేజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గోగినేని తరుణ్, జిల్లా కోశాధికారి డాక్టర్ జి. మహాలక్ష్మి, సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, జె. సురేష్, బోను రామకృష్ణ కలెక్టర్‌ను కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వార్షిక సర్వసభ్య సమావేశ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక ప్రథమ చికిత్స శిక్షణ, దుస్తుల రూపకల్పన, యోగా శిక్షణ కార్యక్రమాల పురోగతిని పరిశీలించారు. జిల్లాలో త్వరలోనే రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా సేవలందించేందుకు జీవిత సభ్యులు, యువ రెడ్‌క్రాస్ వాలంటీర్లను సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో డీఎఫ్‌వో గోపీకృష్ణతో పాటు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చైతన్య విద్యార్థులకు నాసా నేషనల్ లెవెల్ ఫస్ట్ ప్రైజ్



**మండపేట మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** తాపేశ్వరం చైతన్య స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో మరోసారి ప్రతిభ చాటారు. గత విద్యా సంవత్సరంలో నాసా స్పేస్ రీసెర్చ్ కార్యక్రమానికి పంపిన 3 ప్రాజెక్టులలో "అంగారక గ్రహంలో వినూత్న వ్యవసాయం హైడ్రోపోనిక్స్, అక్వాపోనిక్స్ పునరుత్పాదక సాంకేతికతల సమన్వయం అనే ప్రాజెక్ట్ నేషనల్ లెవెల్ ఫస్ట్ ప్రైజ్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ జి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి ఏటా నాసా కార్యక్రమానికి వినూత్న శాస్త్రీయ ప్రాజెక్టులు పంపడం చైతన్య సంస్థల ప్రత్యేకత అన్నారు. ఈ విజయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. విజేత విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.రీజినల్ ఇన్‌చార్జ్ ఎం.వి.ఎల్. నరేష్ మాట్లాడుతూ, అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రీయ ఆలోచనలపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకే ప్రతి సంవత్సరం నాసా ప్రాజెక్టులు పంపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాసా ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరంలో డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు రూ.140 కోట్లతో ప్రణాళిక

## 9వ డివిజన్‌లో 22.75 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరవ్యాప్తంగా రూ.140 కోట్లతో కొత్త డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి, శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసే కార్యక్రమానికి త్వరలో టెండర్లు పిలవనున్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. నగరంలోని 9వ డివిజన్ మహాలక్ష్మి ఆలయం సమీపంలోని విద్యుత్ కాలనీ 7వ వీధిలో రూ.22.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 నుంచి 20 సంవత్సరాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోందన్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరంతరం వినతులు అందజేస్తూనే ఉన్నారని తెలిపారు. అయితే అమృత్ పథకం కింద చేపట్టిన ప్రధాన డ్రైనేజీ పనుల కారణంగా ఈ రోడ్డు నిర్మాణం ఆలస్యమైందని, ప్రస్తుతం అన్ని అడ్డంకులు తొలగడంతో కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ ద్వారా రూ.22.75 లక్షలతో పనులను అధికారికంగా ప్రారంభించామని చెప్పారు. ఈ పనుల్లో భాగంగా సుమారు 220 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు అవసరమైన చోట డ్రైనేజీ లిఫ్టింగ్ పనులు కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 9వ డివిజన్‌లోనే రెండు సంవత్సరాల వ్యవధిలో రూ.14 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టడం గర్వకారణమని చెప్పారు. ఈ డివిజన్‌లో నివసించే ప్రజలందరూ బాధ్యతాయుతమైన పన్ను చెల్లింపుదారులని, వారు వివిధ రూపాల్లో చెల్లించే పన్నుల ద్వారానే కార్పొరేషన్‌కు ఆదాయం వస్తోందని, అలాంటి ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజాప్రతినిధుల కనీస బాధ్యత అని స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.14 కోట్ల పనులు పూర్తిచేసినా, ఇంకా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని తెలిపారు. ముఖ్యంగా నగరాన్ని ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలంటే సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ అత్యంత కీలకమన్నారు. డ్రైనేజీ కనెక్టివిటీ సక్రమంగా ఉంటేనే ప్రజారోగ్యం మెరుగుపడటంతో పాటు నిర్మించిన రోడ్ల ఆయుష్షు కూడా పెరుగుతుందని వివరించారు. డ్రైనేజీ లేకపోతే వర్షపు నీరు రోడ్లపై నిలిచి, పదేళ్లు మన్నాల్సిన రోడ్లు ఐదేళ్లకే దెబ్బతింటాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలకు భవిష్యత్తులో ఎక్కడ ఏ అవసరం ఉంటే అక్కడ అదే అభివృద్ధి కార్యక్రమం చేపడతామని, ప్రజల నుంచి వచ్చే వినతులను పరిశీలించి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. రిషితా గ్రాండ్, డెల్టా ఆసుపత్రి వెనుక ప్రాంతంలోని అధ్వాన్న రహదారుల సమస్యను కూడా కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడి రెండు ప్రధాన రోడ్లకు సుమారు రూ.2 కోట్ల వ్యయంతో డ్రైనేజీ, రోడ్డు పనులు పూర్తి చేశామని, ఇంకా మిగిలిన ప్రధాన పనులను ఎన్‌క్యాప్ నిధుల ద్వారా రూ.80 లక్షల వ్యయంతో ఈ నెల 25వ తేదీన ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నగరంలో ప్రతి రోడ్డు, ప్రతి డ్రైనేజీని దశలవారీగా అభివృద్ధి చేస్తూ ఆరోగ్యకరమైన రాజమహేంద్రవరం నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. డివిజన్ ఇన్‌ఛార్జ్ కోసూరి చండీప్రియ సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొల్లి బుజ్జి, మరుకుర్తి శివ యాదవ్, ముసిని బాబూరావు, విశ్వనాధరాజు, స్థానిక పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# డిమాండ్ల సాధనకై బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్, ఉద్యోగుల ధర్నా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న సంచార్ భవన్ వద్ద బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మూడు రోజుల ధర్నా ప్రారంభమైంది. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు నేటి నుండి మూడు రోజులపాటు డిమాండ్ల సాధనకై ధర్నా ప్రారంభించారు. మూడవ వేతన సవరణ పెన్షన్ సవరణ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిక్యూటివ్ తో సమానంగా నాన్ ఎగ్జిక్యూటివ్ ని ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. బిఎస్ఎన్ఎల్ లో ఆఫర్బిలిటీ,ఎఫర్ధబులిటీ క్లాజ్ ను తొలగించాలని, బిఎస్ఎన్ఎల్ నష్టాలకు ఉద్యోగులు బాధ్యులుగా ఉండబోరని అన్నారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకుని వేతన సవరణ చేయాలని జిల్లా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సెక్రటరీ పి. మహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐ బిడిపిఏ అధ్యక్షులు ఎన్ఎస్ఎన్ మూర్తి, సెక్రటరీ కే.శ్రీనివాస్, కోరుకొండ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# 'మన లెక్కలు - మన డబ్బులు' అవగాహన సదస్సు




**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట 11వ వార్డ్‌లో డ్వాక్రా సంఘాల ఐక్యత సమాఖ్య, ప్రతిభ సమాఖ్య లకు సంబంధించి మన డబ్బులు - మన లెక్కలు యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. 11వ వార్డ్ న్యూకాలని లో ఉన్న ఎస్ సి కమ్యూనిటీ హాల్ లో బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 11వ వార్డ్ మాజీ కౌన్సిలర్ కొవ్వాడ బేబి అప్పన్న బాబు హాజరయ్యారు. కొవ్వాడ బేబి అప్పన్నబాబు మాట్లాడుతూ ఈ మన డబ్బులు మన లెక్కలు అనే యాప్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు.రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదేశాల మేరకు మన డబ్బులు - మన లెక్కలు అనే యాప్ మీద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.డ్వాక్రా కు సంబంధించిన ప్రతీ లెక్కలు ప్రతీ గ్రూప్ సభ్యురాలకు తెలియజేయాలని కోరారు. ప్రతీ గ్రూప్ సభ్యురాలు ఈ యాప్ ను డౌన్ లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెప్మా సి ఓ రాంజీ, ఐక్యత సమాఖ్య ఆర్ పి ఈశ్వరి, ప్రతిభ సమాఖ్య ఆర్పి గౌతమి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం



### సీరియల్లో విలన్.. నెట్టింట గ్లామర్ అరాచకం..

# పెద్ది లుక్స్‌లో గత్తరలేపుతున్న జ్యోత్స్న పాప

ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీతారల హడావిడి గురించి చెప్పక్కర్లేదు. నిత్యం గ్లామరస్ ఫోటలతో గత్తరలేపుతున్నారు. మరోవైపు బుల్లితెర ముద్దుగుమ్మలు సైతం సందడి చేస్తున్నారు. తాజాగా కార్తీక దీపం ఫేమ్ జ్యోత్స్న షేర్ చేసిన పెద్ది లుక్స్ ఫోటోస్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇక ఈ లుక్స్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. మరి రియాక్షన్స్ ఏంటో చూద్దామా. తెలుగు బుల్లితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో గాయత్రి సింహాద్రి ఒకరు. బుల్లితెర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ప్రముఖ సీరియల్ 'కార్తీక దీపం 2' ద్వారా ఈమె విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్నారు. తన నటనతో, విలక్షణమైన హావభావాలతో నెగెటివ్ పాత్రలోనైనా సరే ప్రేక్షకుల మనసు దోచుకున్న గాయత్రి, సోషల్ మీడియాలోనూ నిత్యం యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోషూట్ పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాలు, విభిన్నమైన కాన్సెప్ట్ ఆధారిత ఫోటోషూట్‌లు చేయడానికి ఇష్టపడే గాయత్రి సింహాద్రి, ఈసారి సరికొత్త గ్లామరస్ టచ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'లోని కథానాయిక జాన్వీ కపూర్ రీసెంట్‌గా పరిచయమైన 'అచ్చియమ్మ' పాత్ర ఆధారంగా గాయత్రి ఈ ఫోటోషూట్ చేశారు. ఈ లుక్కులో గ్లామర్ లుక్కులో అదరగొట్టేస్తుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఈ పిక్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ ఫోటోలలో గాయత్రి గ్రామీణ నేపథ్యం ఉన్న సంప్రదాయ దుస్తులలో, నడుము వంపులు చూపిస్తూ ఎంతో అందంగా కనిపించారు. లంగా ఓణీ ధరించి, పల్లెటూరి పడుచు పిల్లలా కనిపిస్తూనే తన ప్రత్యేకమైన గ్లామర్‌తో అందరి దృష్టిని ఆకర్షించారు. జాన్వీ కపూర్ మాస్ అండ్ రోస్టిక్ లుక్‌ను గాయత్రి రీక్రియేట్ చేసిన తీరు నెటిజన్లను విశేషంగా అలరిస్తోంది. అటు విలన్ గా అలరిస్తున్న గాయత్రి.. ఇటు నెట్టింట క్రేజీ ఫోజులతో మతిపోగొట్టేస్తుంది. గాయత్రి ఈ ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలలో పంచుకోగానే క్షణాల్లో వైరల్‌గా మారాయి. అభిమానులు, తోటి సీరియల్ నటీనటులు ఈ పిక్స్‌పై లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "అచ్చియమ్మ పాత్రలో గాయత్రి గ్లామర్ అద్భుతంగా ఉంది", "బుల్లితెర విలన్ ఇప్పుడు ట్రెండింగ్ హీరోయిన్ రేంజ్‌లో మెరిసిపోతోంది" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. 'కార్తీక దీపం' సీరియల్‌లో తన విలనిజంతో మెప్పించిన గాయత్రి, నిరంతరం కొత్త లుక్స్‌తో ప్రయోగాలు చేస్తుంటారు. మోడర్న్ డ్రెస్‌ల నుంచి పద్ధతిగల చీరల వరకు ప్రతీ అవుట్‌ఫిట్‌లోనూ తగిన అందాన్ని ప్రదర్శించడం ఈమె ప్రత్యేకత. ప్రస్తుతం ఈ 'పెద్ది' లుక్స్‌తో బుల్లితెర వీక్షకులను మాత్రమే కాక, సోషల్ మీడియా ఫాలోవర్లను కూడా ఫిదా చేస్తున్నారు. రాబోయే రోజుల్లో వెండితెరపై కూడా అవకాశాలు దక్కించుకునేలా ఆమె తన ఫోటోషూట్లతో సత్తా చాటుతోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సినీ వాయిస్ CINE VOICE

నందమూరి బాలకృష్ణ

# హెల్త్ బులిటెన్ విడుదల చేసిన వైద్యులు



NBK111 సినిమా షూటింగ్‌లో గాయపడిన నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంపై ఏఐజీ ఆస్పత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కాలి కండరంలో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించగా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆర్థోపెడిక్ సర్జన్ల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని తెలిపారు. నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ షూటింగ్ సందర్భంగా గాయపడ్డారు. రాజమండ్రిలో జరుగుతున్న తన తాజా చిత్రం NBK111 షూటింగ్‌లో పాల్గొంటున్న సమయంలో ఆయన ఎడమ మోకాలికి గాయమైనట్లు ఏఐజీ ఆస్పత్రి విడుదల చేసిన మెడికల్ బులెటిన్‌లో వెల్లడించింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన పరీక్షలు, ప్రత్యేక చికిత్స కోసం ఆయన్ను ఎయిర్‌లిఫ్ట్ ద్వారా హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఏఐజీ ఆస్పత్రిలో నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో బాలకృష్ణ ఎడమ మోకాలి చుట్టూ ఉన్న కణజాలాల్లో రక్తం గడ్డకట్టడంతో పాటు వాపు ఉన్నట్లు గుర్తించారు. ఈ లక్షణాలు ఆ ప్రాంతంలో మజిల్ టియర్ (కండరాల చీలిక) ఉండే అవకాశాన్ని సూచిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆర్థోపెడిక్ సర్జన్ల బృందం పర్యవేక్షణలో విస్తృత స్థాయి క్లినికల్, డయాగ్నస్టిక్ పరీక్షలు చేయించుకుంటున్నారు. బాలకృష్ణ గత వైద్య చరిత్రను కూడా పరిగణనలోకి తీసుకుని, వివిధ విభాగాల నిపుణులతో కూడిన మల్టీడిసిప్లినరీ వైద్య బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తోంది. అత్యంత సురక్షితమైన, తగిన చికిత్సను నిర్ణయించేందుకు అన్ని అంశాలను పరిశీలిస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆయన వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు స్పష్టం చేశాయి. కొనసాగుతున్న పరీక్షలు పూర్తయిన అనంతరం తుది చికిత్స ప్రణాళికను ఖరారు చేస్తామని, తదుపరి ఆరోగ్య వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని ఏఐజీ ఆస్పత్రి మెడికల్ బులెటిన్‌లో పేర్కొంది. ఇదిలా ఉండగా, బాలకృష్ణ త్వరగా కోలుకుని మళ్లీ NBK111 షూటింగ్‌లో పాల్గొంటారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా వాయిస్
మీ క్రీడా వార్తల స్వరము

# మ్యాచ్ లైవ్ జియో, స్టార్‌స్పోర్ట్స్, సోని..

### ఎందులోనూ రాదు! మరి లైవ్ ఎక్కడ చూడాలో తెలుసా?




ఇంగ్లాండ్ సిరీస్ నిరాశను మర్చిపోయి జింబాబ్వేపై విజయాలతో ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకుంది. మూడు టీ20 మ్యాచ్‌లు హరారేలోనే జరగనున్నాయి. టీవీ ప్రసారం లేకపోవడంతో అభిమానులు ఒక యాప్‌లో మాత్రమే మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. ఆ వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.. ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో వరుస పరాజయాలతో నిరాశ చెందిన భారత జట్టు ఇప్పుడు జింబాబ్వే పర్యటనతో కొత్త ఆరంభానికి సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్ కోసం టీమిండియా హరారే చేరుకుంది. ఈ సిరీస్ జూలై 23 నుంచి ప్రారంభం కానుండగా, మూడు మ్యాచ్‌లు కూడా హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగానే జరగనున్నాయి. వరుస విజయాలతో తిరిగి ఆత్మవిశ్వాసాన్ని పొందాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన మూడు రోజుల వ్యవధిలోనే భారత జట్టు మరో అంతర్జాతీయ సిరీస్ ఆడనుండటం విశేషం. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని యువ జట్టు ఈ సిరీస్‌లో మంచి ప్రదర్శన చేసి, గత పర్యటనలో ఎదురైన నిరాశను మర్చిపోవాలని భావిస్తోంది. ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొన్న శ్రేయస్ అయ్యర్‌తో పాటు పలువురు ఆటగాళ్లు నేరుగా హరారే చేరుకోగా, మిగతా సభ్యులు తాత్కాలిక ప్రధాన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో భారత్ నుంచి జింబాబ్వేకు వెళ్లారు. మూడు టీ20ల షెడ్యూల్ ఇప్పటికే ఖరారైంది. తొలి టీ20 జూలై 23న సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభం కానుంది. రెండో మ్యాచ్ జూలై 25న, మూడో మ్యాచ్ జూలై 26న అదే సమయానికి హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరగనున్నాయి. అన్ని మ్యాచ్‌లు ఒకే వేదికపై నిర్వహించనున్నారు. ఈ సిరీస్‌కు భారత జట్టులో శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గె, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ చోటు దక్కించుకున్నారు. యువ ఆటగాళ్లకు ఈ సిరీస్‌లో తమ ప్రతిభను నిరూపించుకునే మంచి అవకాశం లభించనుంది.

**లైవ్ ఎక్కడ చూడాలి..?**

అభిమానులకు మాత్రం ఈ సిరీస్ విషయంలో ఒక నిరాశ కలిగించే విషయం ఉంది. భారత్-జింబాబ్వే టీ20 సిరీస్‌కు టెలివిజన్ ప్రసారం ఉండదు. స్టార్ స్పోర్ట్స్, సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లలో మ్యాచ్‌లు ప్రసారం కావు. అలాగే జియోహాట్‌స్టార్, సోనీ లివ్‌లో కూడా ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉండదు. ఈ మూడు మ్యాచ్‌లను అభిమానులు ఫ్యాన్‌కోడ్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రమే లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించాల్సి ఉంటుంది. అందులో చూడాలంటే రూ.35 లతో సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే టీవీలో చూడాలి అనుకుంటే యునైటెడ్8 స్పోర్ట్స్ టీవీ ఛానల్, డీడీ స్పోర్ట్స్ రెండింటిలోనూ లైవ్ చూడవచ్చు.

### హాకీ వరల్డ్ కప్ 2026కు భారత జట్టు ప్రకటన!

# పాకిస్థాన్‌తో మ్యాచ్ ఎప్పుడంటే?




ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే హాకీ ప్రపంచకప్ కోసం భారత హాకీ జట్టును ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, 20 మంది సభ్యుల జట్టులో నలుగురు ఆటగాళ్లకు చోటు దక్కలేదు. పూల్-డిలో ఉన్న భారత్ వేల్స్, ఇంగ్లాండ్, పాకిస్థాన్‌లతో తలపడనుంది. ఆగస్టు 15 నుంచి 30 వరకు బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్త ఆతిథ్యంలో జరగనున్న హాకీ వరల్డ్ కప్ 2026 కోసం ఇండియన్ హాకీ ఫెడరేషన్ మంగళవారం 20 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. అనుభవజ్ఞుడైన డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వరల్డ్ కప్‌లో జట్టు పరిమాణంపై ఉన్న పరిమితి కారణంగా ఇటీవల ఎఫ్ఐహెచ్ ప్రో హాకీ లీగ్‌లో ఆడిన నలుగురు ఆటగాళ్లకు తుది జట్టులో అవకాశం దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్‌థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ ఈసారి జట్టుకు దూరమయ్యారు. పూల్-డిలో ఉన్న భారత్ టోర్నీలో ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత ఆగస్టు 17న ఇంగ్లాండ్‌తో, ఆగస్టు 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో కీలక పోరులో తలపడనుంది. ఈ మూడు మ్యాచ్‌లు భారత జట్టు నాకౌట్ అవకాశాలను నిర్ణయించనున్నాయి. గత 2023 హాకీ ప్రపంచకప్‌లో భారత్ నిరాశపరిచి తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. ప్రపంచకప్ చరిత్రలో భారత్ ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే విజేతగా నిలిచింది. 1975లో పాకిస్థాన్‌ను ఓడించి తొలిసారి, ఇప్పటివరకు ఏకైక టైటిల్‌ను కైవసం చేసుకుంది. అంతకుముందు 1971లో కాంస్య పతకం, 1973లో రజత పతకం గెలిచింది. ఆ తర్వాత ప్రపంచకప్‌లో మరో పతకాన్ని సాధించలేకపోయింది.

**భారత జట్టు**

గోల్‌కీపర్లు: మోహిత్ హెచ్ఎస్, సూరజ్ కర్కెరా.

డిఫెండర్లు: జర్మన్‌ప్రీత్ సింగ్, హర్మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), అమిత్ రోహిదాస్, జుగ్రాజ్ సింగ్, సంజయ్, సుమిత్, యశ్‌దీప్ సివాచ్.

మిడ్‌ఫీల్డర్లు: రాజిందర్ సింగ్, ఆదిత్య అర్జున్ లాలాగే, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, నీలకంఠ శర్మ, వివేక్ సాగర్ ప్రసాద్.

ఫార్వర్డ్‌లు: దిల్‌ప్రీత్ సింగ్, శిలానంద్ లక్రా, సుఖ్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, అభిషేక్.

# ఇండియాకు తిరిగొస్తున్న ఐపీఎల్ సృష్టికర్త..!

### మరి కేసుల సంగతేంటి అంటే..?



16 ఏళ్ల తర్వాత ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోడీ భారత్‌కు తిరిగి రానున్నారు. 2009 ఐపీఎల్ ఫెమా కేసులో అప్పీలేట్ ట్రిబ్యునల్ నుంచి కీలక ఉపశమనం లభించింది. ఈడీ ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ట్రిబ్యునల్ పేర్కొంది. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో భారత్‌కు వస్తానని లలిత్ మోడీ ప్రకటించారు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు, మాజీ ఛైర్మన్ లలిత్ మోడీ దాదాపు 16 సంవత్సరాల తర్వాత భారతదేశానికి తిరిగి రానున్నట్లు ప్రకటించారు. 2009 ఐపీఎల్ సౌతాఫ్రికా నిర్వహణకు సంబంధించిన ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కేసులో అప్పీలేట్ ట్రిబ్యునల్ నుంచి కీలక ఉపశమనం లభించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో భారత్‌కు వస్తానని తెలిపారు. ట్రిబ్యునల్ తీర్పు అనంతరం స్పందించిన లలిత్ మోడీ, 16 ఏళ్ల న్యాయపోరాటానికి చివరికి న్యాయం జరిగిందని పేర్కొన్నారు. తాను మొదటి నుంచి ఐపీఎల్ ప్రయోజనాల కోసమే పనిచేశానని చెబుతూ వచ్చానని, తాజా తీర్పు తన వాదనకు బలం చేకూర్చిందన్నారు. ఈ కేసు ముగియడంతో జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిపారు. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాన్ని కూడా మోడీ వెల్లడించారు. అక్టోబర్‌లో తన కుమార్తెకు కుమారుడు జన్మించనున్నాడని, ఆ తర్వాత భారత్‌కు తిరిగి రావాలని యోచిస్తున్నట్లు చెప్పారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com